# సీమవార్త

## రాయల సీమ

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

పేజీలు : 4

శనివారం 12 సెప్టెంబర్ 2026


## ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు.....
# ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులు.

...--విద్యార్థినుల ఫిర్యాదుతో పాఠశాలకు చేరుకున్న తల్లిదండ్రులు.

....--పోలీసులకు ఫిర్యాదు-ఫోక్సో కేసు నమోదు



# ఆ రోడ్డు ను హైవే చేస్తే... రాజకీయ సన్యాసం..!!

... లోకల్ బాడీలో... మన బాడీ స్ట్రాంగ్ చేసుకుందాం.

...పుట్టపర్తిలో వైఎస్సార్సీపీ విస్తృతస్థాయి సమావేశం

....కూటమి పాలన వైఫల్యాలపై పోస్టర్ల ఆవిష్కరణ

.....2029లో జగన్ సీఎం అవుతారు - మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



పుట్టపర్తి, సెప్టెంబర్ 11 (సీమవార్త బ్యూరో) :

2029లో వైఎస్సార్సీపీ తిరిగి అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని పుట్టపర్తి సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో పుట్టపర్తి సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా నాయకులు కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించిందని, ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ వెన్నుపోటు పాలన పోస్టర్లను విడుదల చేశారు. రాబోయే మున్సిపల్, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ విజయదుందుభి మోగించేందుకు ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పుట్టపర్తి నియోజకవర్గంలో పేకాట, గంజాయి, అక్రమ మద్యం విచ్చలవిడిగా పెరిగిపోయాయని ఆరోపించారు. శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. మల్లికామల, ఒడిసి, అమడగూరు మీదుగా గూళూరు వరకు జాతీయ రహదారి తీసుకొస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి సవాల్ విసిరారు. ఆ రహదారి తేలేకపోతే వారు రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్ రెడ్డి, పుట్టపర్తి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డితో పాటు పుట్టపర్తి నియోజకవర్గంలోని 6 మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కళ్యాణదుర్గాన్ని....కరువు "దుర్గం"గా మార్చిన
# ఎల్‌నినో వర్షాభావం

-- కానరాని వర్షపు జాడ
- బీడుపడిన భూములు

-- పొలాలలో ఎండిపోయిన బోర్లు అడుగంటిన భూగర్భ జలాలు

-....70 శాతంపైగా బీడుగా ఉంచిన భూములు....పండని కూరగాయలు-ఆకుకూరలు

--... ఆకాశాన్నింటిన నిత్యావసర సరుకులు...- భారమవుతున్న పేదవాడి జీవితం

(కండే. లింగ ప్రసాద్ సీనియర్ జర్నలిస్ట్ )

కళ్యాణదుర్గం సెప్టెంబర్ 11 సీమ వార్త

కళ్యాణదుర్గం కరువుకు కాణాచి అనే పేరుంది. అంతేకాకుండా పేరులో కళ్యాణం అనే మాట ఉన్నా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కరువు పిలిస్తే పలుకుతుందనే అభిప్రాయం కూడా ఉంది. ప్రతి ఏటా వర్షాలు కురవకపోవడంతో నష్టాల సేద్యంతో రైతు కరువుతో నిత్యం పోరాటం చేస్తూనే ఉన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర పలకక పోయినా, × పంట దిగుబడులు అంతంత మాత్రంగానే ఉన్నా ఆశ చావని రైతు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. మరి కొందరు రైతులు రైతు కూలీలు ఉన్న ఊరిని, వృద్ధ తల్లిదండ్రులను ఇంటి వద్దనే వదిలేసి పొట్ట చేత పట్టుకొని పట్టణాలకు వలస వెళుతున్నారు. వలస జీవితాలతో కుటుంబాలు చిద్రమవుతున్నాయి. ఈ పరిస్థితులన్నీ పాలక ప్రభుత్వాలకు స్పష్టమైన అవగాహన కూడా ఉంది. ఈ నేపథ్యంలోనే కుందుర్పి బ్రాంచి కెనాల్ ద్వారా 114 చెరువులకు సాగునీరు అందించే పథకం దశాబ్ద కాలంగా ఆచరణకు నోచుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి - మిగతా3లో



# కేతిరెడ్డి ఉన్నాడు... భయపడొద్దు, వెనకడుగు వేయద్దు..!!

.....కార్యకర్తలు భయపడొద్దు.....నష్టపోయిన ప్రతి కార్యకర్తను ఆదుకుంటాం - కేతిరెడ్డి పెద్దారెడ్డి

....మున్సిపల్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం

తాడిపత్రి, సెప్టెంబర్ 11 సీమ వార్త



తాడిపత్రి పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో వైసీపీ పట్టణ అదేక్షుడు మాజీ కౌన్సిలర్ రాబట్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశనికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా పెద్దరెడ్డి జేసీ పై నిప్పులు చెరిగారు. ఈ సమావేశానికి తాడిపత్రి, పెద్దవడుగూరు, యాడికి, పెద్దపప్పూరు మండలాల నుండి వైసీపీ ముఖ్య నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

**కార్యకర్తలకు కేతిరెడ్డి భరోసా :**

ఈ సందర్భంగా కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ..

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ అన్ని వార్డుల్లో పోటీ చేస్తుందని, అభ్యర్థుల ఎంపికలో కష్టపడిన కార్యకర్తలకే ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. గత ఏడాదిగా టీడీపీ ప్రభుత్వం తమ కార్యకర్తలను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తోందని, అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, ప్రతి కార్యకర్తకు తాము అండగా ఉంటామని, వారి వెనుక తాను ఉన్నానని భరోసా ఇచ్చారు.

**జేసీ ఫ్యామిలీపై విమర్శలు :**

తాడిపత్రి పట్టణంలో గత ఏడాదిగా ఎక్కడా అభివృద్ధి జరగలేదని, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. అభివృద్ధి జరిగింది కేవలం జేసీ కుటుంబంలో మాత్రమేనని, వారి ఆస్తులు మాత్రమే పెరిగాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ హయాంలో నష్టపోయిన ప్రతి కార్యకర్తను ఆదుకుంటామని, వారికి న్యాయం చేస్తామని, కోల్పోయిన ప్రతిదీ తిరిగి ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

**గెలుపే లక్ష్యంగా పనిచేయాలి :**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా ఇప్పటి నుండి క్షేత్ర స్థాయిలో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, సర్పంచులు, మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేతన్నలకు ఊరట..రూల్స్ రిటన్..!!

మాస్టర్ వీవర్ ధ్రువీకరణ పత్రం, వేతన వివరాలు అందిస్తే సరిపోతుంది.

.....50 ఏళ్లు నిండిన నేతన్నలందరికీ పెన్షన్లు ఇస్తాం.

.....అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

.....నేతన్నలకు ఆర్థిక మేలు చేకూర్చడమే సీఎం చంద్రబాబు లక్ష్యం.

.....రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత.

......నూతన నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తులో కీలక నిబంధన మినహాయింపు

.....బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్ ఇవ్వాల్సిన అవసరం లేదు.

పుట్టపర్తి డెస్క్ (అమరావతి) సెప్టెంబర్ 11 సీమ వార్త

నూతన నేతన్న భరోసా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్న చేనేతలకు ఊరటనిచ్చేలా కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. నేతన్న భరోసా పథకం కింద పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే చేనేతలు బ్యాంకు స్టేట్ మెంట్ అందజేయాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. మాస్టర్ వీవర్ నుంచి వేతనాలు తీసుకున్న వివరాలు అందజేస్తే సరిపోతుందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని రకాల పెన్షన్లు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల ఏడో తేదీ నుంచి వృద్ధ్యాప్యం, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, చేనేత సహా అన్ని రకాల పెన్షన్లకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో నేతన్న భరోసా పెన్షన్ కు దరఖాస్తు చేస్తుకుంటున్న నేతన్నలకు బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్ నిబంధన తీవ్ర ప్రతిబంధకంగా మారింది. మాస్టర్ వీవర్ దగ్గర పనిచేసే చేనేతలకు వ్యక్తిగతంగానే వేతనాలు చెల్లిస్తూ వస్తుంటారు. అటువంటి సమయంలో బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్ - మిగతా3లో



# ధర్మవరంలో 14 సెంట్ల స్థలంపై ఫోర్జరీ ఆరోపణలు

....నకిలీ పత్రాలు సృష్టించారంటూ కోటి మహా లక్ష్మి అనే మహిళ ఫిర్యాదు
....1999 అనంతపురం జిల్లా కోర్టు తీర్పుతో తమకు ఆస్తిపై హక్కులు వచ్చాయన్న బాధితురాలు
....ఫోర్జరీ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి అసలు సూత్రధారులను గుర్తిస్తామన్న...వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప

**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 11 సీమ వార్త.** ధర్మవరం పట్టణానికి చెందిన కోటి మహాలక్ష్మి (65) తనకు,తన కుటుంబ సభ్యులకు చెందిన 14 సెంట్ల స్థలాన్ని కాజేయాలనే ఉద్దేశంతో తమ సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలు సృష్టించారని ఆరోపిస్తూ పోలీసులను ఆశ్రయించారు.ఈ మేరకు ధర్మవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రెడ్డప్పకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.బాధితురాలి వివరాల మేరకు..ధర్మవరం పట్టణంలోని జోగోనుకుంట ప్రాంతంలో ఉన్న 14 సెంట్ల స్థలంపై తమకు హక్కులు ఉన్నాయని తెలిపారు.1999లో అనంతపురం జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా తనకు, తన కుటుంబ సభ్యులకు ఆస్తిపై హక్కులు సంక్రమించాయని పేర్కొన్నారు.అయితే ఆ ఆస్తిని అక్రమంగా స్వాధీనం చేసుకునే ఉద్దేశంతో ఒక వ్యక్తి తమ సంతకాలను పోలిన విధంగా ఫోర్జరీ చేసి, నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలను సృష్టించారని ఆరోపించారు.2001లోనే ఆస్తిని కాజేయడానికి నకిలీ పత్రాలు సృష్టించినట్లు తమకు తెలిసిందని బాధితురాలు తెలిపారు. కొందరు వ్యక్తులు అక్రమంగా లబ్ధి పొందేందుకు కుట్రపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు.అసలు సంతకాలను పోలినట్లుగా ఫోర్జరీ




చేసి పత్రాలు తయారు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో తీవ్ర ఆందోళనకు గురైనట్లు తెలిపారు.తనకు జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ జరిపి, నకిలీ పత్రాలు సృష్టించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోటి మహాలక్ష్మి పోలీసులను కోరారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి ఆధారాలను పోలీసులతో పాటు పాత్రికేయులకు కూడా సమర్పిస్తామని తెలిపారు.బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టి, ఆధారాలను పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. ఫోర్జరీ వ్యవహారంపై సమగ్రంగా దర్యాప్తు చేసి,అసలు సూత్రధారులను గుర్తించి,నకిలీ పత్రాల వెనుక ఉన్న వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తామని వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపినట్లు బాధితురాలు పేర్కొన్నారు.

## మట్టి వినాయకుడినే పూజిద్దాం... పర్యావరణం పరిరక్షిద్దాం



**అమరాపురం సెప్టెంబర్ 11సీమవార్త** మండల పరిధిలోని హేమావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో విద్యార్థిని విద్యార్థులు కలసి పర్యావరణాన్ని పరిరక్షించి కాపాడాలని ప్రతి ఒక్కరు కూడా మట్టి వినాయకుని వాడాలని మరియు పర్యావరణాన్ని పరిరక్షించాలని విద్యార్థిని విద్యార్థులు మట్టి వినాయకులను తయారుచేసి మట్టి వినాయకుల్ని పాఠశాల ఆవరణంలోని నిమజ్జనం చేయడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీల రాణి, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తూ కాలుష్యాన్ని అరికట్టాలని, విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుని వాడాలని, రసాయనాలతో తయారుచేసిన వినాయక విగ్రహాలను బదులుగా మట్టి మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలను , ప్రజలను మరియు విద్యార్థిని విద్యార్థులను ప్రధాన ఉపాధ్యాయులు మట్టి వినాయకులను తయారు చేసిన విధానాన్ని చూసి విద్యార్థులను అభినందిస్తూ ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలను చేసి, పాఠశాల ఆవరణంలోనే మట్టి వినాయకుని నిమజ్జనం చేయడం జరిగిందని ప్రధాన ఉపాధ్యాయురాలు లీలారాణి పేర్కొన్నారు.

## సేవలు చేయుటములోనే నిజమైన సంతృప్తి ఉంది.

శ్రీ సత్య సాయి సేవ సమితి కన్వీనర్ నామా ప్రసాద్.






**ధర్మవరం సెప్టెంబర్ 11 సీమవార్త :** ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు సేవలు చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంది అని శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నామా ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 360 మంది రోగులకు, సహాయకులకు, అదేవిధంగా గర్భిణీ స్త్రీలకు భోజనపు ప్యాకెట్లను, వాటర్ ప్యాకెట్స్ లను, స్వీట్ లను ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిస్టర్ల చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ నామ ప్రసాద్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పుట్టపర్తి సాయిబాబా ఆశీస్సులతో, దాతల సహాయ సహకారములతో పట్టణంలోని శ్రీ సత్య సాయి సేవ సమితి గాంధీ నగర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని సంతోషాన్ని వ్యక్తం చేశారు. నేటి ఈ సేవా కార్యక్రమానికి సేవాదాతగా కీర్తిశేషులు ఎర్రమల కృష్ణమూర్తి, వారి కుమారుడు చెన్నప్ప దాతలుగా నిర్వహించినందుకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డిపేంద్ర నాయక్ మాట్లాడుతూ శ్రీ సత్య సాయి సేవ సమితి చేస్తున్నటువంటి ఇటువంటి సేవా కార్యక్రమాల పట్ల వారు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు వరంలాగా మారాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో 27 మంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఏలాంటి అభ్యంతరాలు రాలేదు.

:-కమీషనర్ సతీష్ కుమార్.



**పెనుకొండ సెప్టెంబర్ 11 సీమవార్త.** పురపాలక సంఘం లో 23వార్డు లకు 28 పోలింగ్ స్టేషన్ మసాయిదాపై ఏలాంటి అభ్యంతరాలు సూచనలు రాలేదని మున్సిపల్ కమీషనర్ సతీష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గుర్తిపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. 10న డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల లీస్టు ప్రకటన చేశామన్నారు. 11న పురపాలక సంఘం కార్యాలయం లో సూచనలు, సలహాలు సంబందిత పోలింగ్ స్టేషన్లపై ఇవ్వండని సూచించడం జరిగిందన్నారు.ప్రకటించిన ముసాయిదా జాబితాపై ప్రజలు, గుర్తింపు పొందిన రాజకియ పార్టీ నాయకుల నుంచి ఏలాంటి అభ్యంతరాలు రాలేదని తెలియజేశారు.

## వినాయక చవితి ఉత్సవాలపై అధికారుల సమావేశం



**యాడికి సెప్టెంబర్ 11 ( సీమ వార్త )** యాడికి మండలంలో సెప్టెంబర్ 14న నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం సి ఐ ఆర్. శ్రీనివాసులు డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసులు పోలీసు రెవెన్యూ అధికారులు గ్రామ మత పెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు చోటుచేసు కోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు వినాయక మండపాలవద్ద విద్యుత్ భద్రత ట్రాఫిక్ నియంత్రణ సౌండ్ సిస్టమ్ వినియోగం నిమజ్జనం ఏర్పాట్లపై చర్చించారు నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ కులమతాలకు అతీతంగా ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులు సూచించారు ఈ కార్యక్రమంలో ఫైర్ జె. రామాంజనేయులు రెడ్డి ఎఫ్ ఎం ఫైర్ యు మనోహర్ ఏ ఎస్ ఐ జి వెంకటేష్ డిప్యూటీ ఎంపీడీవో శశికళ వీఆర్వో దామోదర్ నాయుడు పాస్టర్ల సంఘం అధ్యక్షుడు పాస్టర్ బత్తుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతం



**పులివెందుల సెప్టెంబర్ 11 (సీమ వార్త):** పులివెందుల పట్టణంలో శుక్రవారం నిర్వహించిన బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతమైంది. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా ఒకరోజు నిర్వహించిన ఈ సమ్మెకు పట్టణ పరిధిలోని వివిధ బ్యాంకులు సంఘీభావం ప్రకటించి ఆమేరకు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐదు రోజుల బ్యాంకింగ్, ఆమోదయోగ్యమైన పి ఎల్ ఐ నిబంధనలు, ఎన్ పి ఎస్ నుండి ఓ పి ఎస్ కు బదిలీ, వివిధ కేడర్లలో సిబ్బంది నియామకాలు, మన ఎన్ పి ఎస్ కు యజమాని అందించే 4% అదనపు వాటాపై ఆదాయపు పన్ను మినహాయింపు, గ్రాట్యుటీ సంబంధిత సమస్యలు, పెన్షనర్ల సంబంధిత సమస్యలు, లీవ్ బ్యాంక్ ప్రవేశపెట్టడం వంటి న్యాయబద్ధమైన డిమాండ్లను సాధించడానికి యావత్ బ్యాంకింగ్ పరిశ్రమ ఉద్యోగుల ఐక్యతను ప్రదర్శించారు. తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాల్సిందిగా వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లోకల్ సెక్రటరీ ఎస్ఎండీ రఫీ ( ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ ) అలాగే లోకల్ సెక్రటరీలు శివ అన్వేష్ రెడ్డి, వై వెంకట్రామిరెడ్డి, ఓబులేసు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగిరెడ్డి బరోడా బ్యాంక్ వై శివ,, చైతన్య కుమార్ రెడ్డి చైతన్య కుమార్ రెడ్డి, ప్రతిభ, రాఘవ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## పుట్టపర్తిలో పీఎంఏవై 2.0 దరఖాస్తుల ఆహ్వానం

ప్రతి నెలా గృహ నిర్మాణ కార్యాలయంలో స్వీకరణ

అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలి

**పుట్టపర్తి, సెప్టెంబర్ 11(సీమవార్త బ్యూరో) :** పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేదలకు పీఎంఏవై 2.0 పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తామని గృహ నిర్మాణ సంస్థ అధికారులు ప్రకటన ద్వారా తెలిపారు. ఈ నెల నుంచి ప్రతి నెలా పుట్టపర్తి గృహ నిర్మాణ సంస్థ సహాయక ఇంజనీరు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని గృహ నిర్మాణ సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవల్లిక తెలిపారు. పాత ఇళ్లలో, అద్దె ఇళ్లలో, రేకుల షెడ్లలో, ఉమ్మడి కుటుంబాలలో నివసిస్తున్న వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుకు భార్య, భర్త ఆధార్ జిరాక్సులపై సంతకం, ఫోన్ నంబర్, రేషన్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, స్థలం పట్టా లేదా రిజిస్టర్ డాక్యుమెంట్ జిరాక్స్, రెండు ఫోటోలు, ఆధార్ అనుసంధాన ఫోన్ నంబర్ సమర్పించాలన్నారు. పక్కా ఇల్లు కలిగిన వారు, టిడ్కో ఇళ్లు మంజూరైన వారు, గతంలో గృహ నిర్మాణ సంస్థ ద్వారా లబ్ధి పొందిన వారు అనర్హులని స్పష్టం చేశారు.

## "బ్రెయిన్ స్ట్రోక్ సేవా వైద్య రత్న" గుళ్ల రమేష్‌కు ఘన సన్మానం



**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 11 సీమవార్త :** ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు ఉచిత సేవలు అందించడంతో పాటు ఆదరణ లేని వృద్ధులు,మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి ఆశ్రయం కల్పిస్తూ సేవలు చేస్తున్న శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుళ్ల రమేష్‌ను గొడుగు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొడుగు నాగరాజు,సత్య నిర్ధారణ్ తో పాటు ట్రస్ట్ సభ్యులు ధర్మవరం రైల్వే స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు.దశాబ్ద కాలంగా గుళ్ల రమేష్ తన ఆశ్రమం ద్వారా వృద్ధులకు వసతి,ఆహారం కల్పించడంతో పాటు మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి ఆశ్రయం,సేవలు అందిస్తున్నారని గొడుగు నాగరాజు తెలిపారు. ఇటీవల ఫిజియోథెరపీ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి మరిన్ని సేవలకు శ్రీకారం చుట్టిన రమేష్ సేవలను ఆయన అభినందించారు.ఈ సందర్భంగా రమేష్‌ను లి"బ్రెయిన్ స్ట్రోక్ సేవా వైద్య రత్న"లిగా అభివర్ణించారు. ధర్మవరం చేనేత పరిశ్రమకు ప్రసిద్ధి చెందడంతో పాటు స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించే సామాజిక శ్రేయోభిలాషులు ఇక్కడ ఎంతోమంది ఉన్నారని గుళ్ల రమేష్ అన్నారు.సామాజిక సేవలో తాను ముందుకు సాగేందుకు ధర్మవరం ప్రజల ప్రోత్సాహం ఎంతో ఉందని పేర్కొన్నారు.సోంపేటలో అందిస్తున్న సేవలను త్వరలో ధర్మవరంలోనూ ప్రారంభించేందుకు ప్రయత్నిస్తామని గొడుగు నాగరాజు తెలిపారు.కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రిటైర్డ్ డీఎస్పీ రమాకాంత్,అన్నపాటి వెంగముని తదితరులు పాల్గొన్నారు.

## విజన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు మట్టి విగ్రహాలు తయారీ పోటీలు






**యాడికి సెప్టెంబర్ 11( సీమ వార్త )** యాడికి మండల కేంద్రంలోని విజన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు విద్యార్థులకు మట్టి విగ్రహాల తయారీ పోటీలు ఘనంగా నిర్వహించారు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కాకుండా మట్టి వినాయక విగ్రహాల ప్రాధాన్యతను తెలియజేసేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఆకర్షణీయమైన మట్టి వినాయకులను తయారు చేశారు అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు విజన్ స్కూల్ కరస్పాండెంట్ విశ్వనాథ్ విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేసి అభినందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు పర్యావరణంపై అవగాహన కల్పించడమే ఈ పోటీల లక్ష్యమని అన్నారు మట్టి గణపతులను పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ గణపతి ని తయారు చేసిన ప్రభుత్వ కళాశాల విద్యార్థినిలు





**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 11 సీమవార్త :** వినాయక చవితి పండుగ తెలుగువారి ప్రధమ పండుగ ఈ పండుగ సందర్బంగా మట్టి గణపతి ని తయారు చేసి ఆదర్శం గా నిలిచారు ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని లు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్. వనిత వాణి సహకారం తో ఈ పర్యావరణ పరిరక్షణ గణపతి ని తయారు చేయడం జరిగిందన్నారు. మట్టి గణపతి ప్రకృతి, గణపతి ఆశీర్వాదములతో అందరూ బాగుండాలని ముందుగా వీరు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ విద్యార్థిని ల తో బాటు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినిల ప్రతిభ ను ప్రిన్సిపాల్ ఎమ్. వనిత వాణి అభినందించారు.

## కార్యకర్త కుటుంబానికి అండగా కేతిరెడ్డి పెద్దారెడ్డి

**హత్యకు గురైన వైసీపీ కార్యకర్త అబ్దుల్ కుటుంబానికి రూ.4 లక్షల ఆర్థిక సాయం**



**తాడిపత్రి, సెప్టెంబర్ 11 సీమ వార్త :** కార్యకర్తే పార్టీకి బలం అని మరోసారి నిరూపించారు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి. కార్యకర్తల కష్టాల్లో తోడుగా నిలవడం, వారి కుటుంబాలకు అండగా ఉండటం.. ఇదే కేతిరెడ్డి పెద్దారెడ్డి మానవత్వానికి నిదర్శనం అంటూ వైసీపీ శ్రేణులు కొనియాడుతున్నాయి. గత కొద్ది నెలల క్రితం దుండగుల చేతిలో హత్యకు గురైన తాడిపత్రికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రియాశీల కార్యకర్త అబ్దుల్ అలియాస్ బండ కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శుక్రవారం హుటాహుటిన వారి నివాసానికి వెళ్లారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.4 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కేవలం ఆర్థిక సాయమే కాదు, భవిష్యత్తులో కూడా ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని, ఏ కష్టం వచ్చినా తాను ఉన్నానని కొండంత భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి మాట్లాడుతూ.. అబ్దుల్ పార్టీ కోసం ఎంతో కష్టపడ్డ కార్యకర్త అని, అతన్ని కోల్పోవడం పార్టీకి తీరని లోటు అని అన్నారు. అతని కుటుంబాన్ని ఆదుకునే బాధ్యత తనదని, వైసీపీ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు. కష్టకాలంలో తమను ఆదుకున్న కేతిరెడ్డి పెద్దారెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాణిపాకం బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే అష్మిత్ రెడ్డికి ఆహ్వానం

**ఆహ్వాన పత్రిక అందజేసిన ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు పరిమి చంద్రకళ**



**తాడిపత్రి, సెప్టెంబర్ 11 సీమ వార్త :** చిత్తూరు జిల్లా కాణిపాకంలోని ప్రసిద్ధ స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ నెల 14వ తేదీ నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్న బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను శుక్రవారం తాడిపత్రిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డికి కాణిపాకం ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు పరిమి చంద్రకళ అందజేశారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డి మాట్లాడుతూ.. కాణిపాకం వినాయకుడి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం సంతోషంగా ఉందని, తప్పకుండా బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయన్ టీయుసి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్ నాయుడు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడిని పూజించండి

**- ప్రిన్సిపాల్ పద్మశ్రీ**




**ధర్మవరం సెప్టెంబర్ 11 సీమవార్త :** మట్టి వినాయకుడిని విద్యార్థులు తయారుచేసి, పూజించాలని మోడల్ స్కూల్ అండ్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని మోడల్ స్కూల్ అండ్ కళాశాలలో విద్యార్థుల కొరకు వినాయక పండుగని దృష్టిలో ఉంచుకొని పాఠశాల విద్యార్థులందరికీ బంకమట్టిని పంపిణీ చేసి, వినాయకుని ప్రతిమను తయారు చేయించారు. ఈ సందర్భంగా మట్టితో తయారుచేసిన వినాయకులను వారు పోటీగా పరిశీలించి, అందులో ప్రథమ, ద్వితీయ స్థానంలో విజేతలను ప్రకటించి బహుమతులను వారు అందజేశారు. అనంతరం వినాయక పండుగ విశిష్టత గూర్చి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఫార్మ్ పాండ్సతో నీటి నిల్వ...వీడ్ మ్యాట్‌తో తేమ సంరక్షణ.....

**నీటి పొదుపుతో పాటు సాగు వ్యయాన్ని తగ్గించుకోవచ్చు....**

**ఉద్యానశాఖ అధికారి లావణ్య.....**

**నంబూలపూలకుంట, సెప్టెంబర్ 11 (సీమవార్త):** ఎన్.పి.కుంట మండలంలోని రైతులు ఉద్యాన పంటల్లో నీటి కొరతను అధిగమించడంతో పాటు సాగు వ్యయాన్ని తగ్గించుకునేందుకు రైతులు ఫార్మ్ పాండ్స్, డ్రిప్ ఇరిగేషన్, వీడ్ మ్యాట్ వంటి సాంకేతిక పద్ధతులను సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యానశాఖ అధికారి కుమారి లావణ్య సూచించారు. వర్షపు నీటిని ఫార్మ్ పాండ్స్‌లో నిల్వ చేసుకుని అవసరమైన సమయంలో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంటలకు అందించడం వల్ల నీటిని సమర్థంగా వినియోగించుకోవచ్చని తెలిపారు.మామిడి, చీని, దానిమ్మ తదితర ఉద్యాన పంటల్లో మొక్కల చుట్టూ వీడ్ మ్యాట్ పరచడం ద్వారా కలుపు మొక్కల పెరుగుదలను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. వీడ్ మ్యాట్ నేలపై పరచడం వల్ల నేలలోని తేమ ఎక్కువ కాలం నిలిచి ఉండటంతో పాటు నీటి ఆవిరీభవనం తగ్గుతుందని తెలిపారు. దీంతో తరచూ నీరు పెట్టాల్సిన అవసరం తగ్గి, కూలీల ఖర్చు కూడా నియంత్రించుకోవచ్చన్నారు. ఫార్మ్ పాండ్స్‌కు 50 శాతం రాయితీ 20 ఐ 20 ఐ 3 మీటర్ల పరిమాణంలో ఫార్మ్ పాండ్ నిర్మాణానికి యూనిట్ ఖర్చు రూ..1,80,000 కాగా, ప్రభుత్వం రూ..90,000 రాయితీ అందిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారి తెలిపారు. వర్షాకాలంలో లభించే నీటిని నిల్వ చేసుకుని, పంట అవసరాలకు అనుగుణంగా డ్రిప్ ద్వారా వినియోగించుకోవడం ద్వారా నీటి కొరత సమయంలో రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని వివరించారు. వీడ్ మ్యాట్‌కు కూడా రాయితీ వీడ్ మ్యాట్ యూనిట్ ధర చదరపు మీటరుకు రూ..25 కాగా, ప్రభుత్వం రూ..12.50 రాయితీ అందిస్తుందని తెలిపారు. ఒక్క రైతుకు గరిష్ఠంగా 4,000 చదరపు మీటర్ల వరకు అర్హత ఉంటుందని, 100 మరియు 110 జి.ఎస్. ఎం స్పెసిఫికేషన్ కలిగిన వీడ్ మ్యాట్‌కు ఈ సదుపాయం వర్తిస్తుందని పేర్కొన్నారు. వీడ్ మ్యాట్ వినియోగం వల్ల ఉద్యాన తోటల్లో కలుపు నియంత్రణ, నేల తేమ సంరక్షణ, నీటి ఆవిరీభవనం తగ్గింపు వంటి ప్రయోజనాలు లభిస్తాయని లావణ్య తెలిపారు. అలాగే కలుపు తొలగించేందుకు అవసరమయ్యే కూలీల సంఖ్య తగ్గడంతో రైతులకు సాగు వ్యయం కూడా తగ్గుతుందని చెప్పారు. నీటి నిల్వకు ఫార్మ్ పాండ్, నీటి పొదుపునకు డ్రిప్, తేమ సంరక్షణకు వీడ్ మ్యాట్ కలిపి వినియోగించడం ద్వారా ఉద్యాన పంటల్లో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. తద్వారా పంటల



దిగుబడి, నాణ్యత మెరుగుపడటంతో పాటు రైతులకు మరింత లాభదాయకమైన సాగు సాధ్యమవుతుందని తెలిపారు.

# ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం.







**:-జర్నలిస్టుల సమస్యలపై సమిష్టిగా పోరాడుదాం.**

**:-అనంతపురం జిల్లా అధ్యక్షులు రేపటి రామాంజనేయులు.**

**పెనుకొండ సెప్టెంబర్ 11సీమవార్త.** ఓర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమిష్టిగా పోరాడుదాం అని, అందుకు అందరూ ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షులు రేపటి రామాంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం పెనుకొండ పట్టణంలోని ఎంక్యూఏ గ్లోబల్ ట్ర స్ట్ లో ఏపీడబ్ల్యూజేఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా కార్యవర్గ సమావేశం ఏపీడబ్ల్యూజేఎఫ్ పెనుకొండ శాఖ అధ్యక్షులు పోతులయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం పోరాడుతోందని, ముఖ్యంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. జర్నలిస్టుల ఎదుర్కొంటున్న సమస్యలలో ముఖ్యంగా జర్నలిస్టులపై రాజకీయ నాయకులు, అధికారుల దాడులు ఎక్కువయ్యాయని అక్రమ కేసులతో వేధిస్తున్నారని పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన ఓ మంత్రిపై నంద్యాలలో లోగుట్టు అనే కథనం రాసినందుకు ఐ న్యూస్ విలేకరులపై కేసులు నమోదుచేసి సబ్ జైల్లో ఉంచడం అన్యాయం అన్నారు. జర్నలిస్టుల పై దాడులను అరికట్టడానికి రక్షణ చట్టం అవసరమని ఆయన తెలిపారు. ఈనెల 21, 25 తేదీలలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ శ్రీసత్య సాయిజిల్లా నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని, ఈ ఎన్నికల లో పాల్గొనడానికి సభ్యత్వం తప్పనిసరిగా ఉండాలని, సభ్యత్వం ఉంటేనే ఓటింగ్ లో పాల్గొనేటందుకు అవకాశం ఉంటుందని, అందుకోసం ఈనెల18వ తేదీ లోపల సభ్యత్వ రుసుము చెల్లించి సభ్యత్వం చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న ఏపీడబ్ల్యుఎఫ్ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల ఇంటి పట్టాలు, ఉచిత వైద్యం,జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య, తదితర విషయాలపై సమిష్టిగా పోరాడాలని తెలిపారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ పెనుకొండ డివిజన్ అధ్యక్షులు పోతులయ్య మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా జర్నలిస్టుల సమస్యలపై ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం పోరాడుతోందని రాష్ట్ర ,జిల్లా నాయకుల పిలుపుమేరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్షులు రేపటి రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి శివప్రకాష్, బి జె ఏ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్కే సూర్య, వెటరన్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాబ్జాన్, ఏపీ బీజేఏ కార్యదర్శి రామ్మూర్తి, ఏపీ ఎస్ఎండిఏపి జేఏ అనంతపురం జిల్లా అధ్యక్షులు ఉద్దండం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు రవీంద్ర, ఏపీడబ్ల్యూజేఎఫ్ అనంతపురం నాయకులు ప్రకాష్ , సత్యసాయి జిల్లా సాక్షి స్టాఫర్ రాజేష్, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కమిటీల నాయకులు, ఏపీడబ్ల్యుఎఫ్ పెనుకొండ నాయకులు పోతులయ్య, నవీన్ కుమార్, జాకీర్ హుస్సేన్, హరి, క్రిస్టఫర్, ప్రకాష్, గోపాల్, మల్లికార్జున, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాసులు,బుట్టే. రామాంజనేయులు జిల్లా పాత్రికేయులు పాల్గొన్నారు.

## ఉద్యాన కళాశాలలో ఓజోన్ డే ఎల్ నినో క్విజ్ పోటీలు




**పులివెందుల సెప్టెంబర్ 11 (సీమ వార్త):** ప్రపంచ ఓజోన్ దినం సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి మరియు ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓజోన్ పరిరక్షణ, ఎల్ నినో ప్రభావం, వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన క్విజ్ పోటీలు రెండవ రోజు డాక్టర్ వైయస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం ఉద్యాన కళాశాలలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని కళాశాల డీన్ డాక్టర్ నాగరాజు ప్రారంభించి మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, ఓజోన్ పొర పరిరక్షణ, ఎల్ నినో వంటి అంశాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం కాలానుగుణ అవసరమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో యువత చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సభ్యులు, క్విజ్ మాస్టర్ క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సమకాలీన అంశాలపై అవగాహన పెంచడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ, సమాజానికి ఉపయోగపడే విద్యా, వైద్య,పర్యావరణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను సంస్థ నిరంతరం నిర్వహిస్తోందని, విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్విజ్ పోటీలలో కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం ప్రథమ, ద్వితీయ స్థానాల విజేతలను ప్రకటించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్ సదరున్నీసా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యశ్వంత్, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఖ

## ఉద్యోగ భద్రత, ఆరోగ్యం పై అవగాహన సదస్సు.



**పులివెందుల సెప్టెంబర్ 11 (సీమ వార్త):** వేముల మండలం ఎం తుమ్మలపల్లి సమీపంలోని యురేనియం ప్రాజెక్టు లో శుక్రవారం కేంద్ర కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ, గనుల భద్రతగా కార్యాలయం, నెల్లూరు రీజియన్ నుండి శ్రాజ్ కిషోర్ సింగ్ , గనుల భద్రతా సంచాలకులు కుపర్తి కిషోర్ కుమార్ గనుల భద్రతా ఉపసంచాలకులు ఉద్యోగ భద్రత, ఆరోగ్యం మరియు పని పరిస్థితులు (కేంద్ర) నియమాలు, 2026" పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మికుల భద్రతా, సంక్షేమం లో పాటించవలసిన నియమాలు, వాటి ప్రాముఖ్యత ను ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. గని కార్మికుల హోకులు, మేనేజ్మెంట్ వారి బాధ్యతలు, వివరించారు. , డి డి ఎం ఎస్ కిషోర్ కుమార్ గారు త్రాగునీరు ఫస్ట్ ఎయిడ్ సెంటర్స్ ,కార్మికుల హెల్త్ చెక్ అప్ ప్రతి ఇయర్ చేయించి ఒకవేళ వారికి ఇటువంటి డిసీజెస్ ఉన్న కంపెనీ భరించాల్సిందిగా వారికి క్యాంటీన్ లు కూడా పరిశీలించి పరిశుభ్రమైన బోజనసాధుపయలు ఉండేలా చూడాలని సకాలం లో వేతనాలు మరియు కొత్తగా సెంట్రల్ రూల్స్ అన్ని ఇంప్లిమెంట్ చేయాలని కోరడం జరిగినది, డి ఎం ఎస్ శ్రీ రాజ్ కుమార్ సింగ్ గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ట్రైనింగ్ క్లాసెస్ కండక్ట్ చేసి ప్రతి ఒక్కరిని భద్రత ఆరోగ్యం తప్పకుండా కార్మికుల రక్షణ పాటించాలని కంపెనీలో ఎటువంటి సంఘటనలు జరిగినా ఏ విధమైన ప్రాబ్లం అనిపించిన తమకు గానీ కంపెనీ సీనియర్స్ దృష్టికి తీసుకురావాలని చెప్పడం జరిగింది, ఇవన్నీ తప్పకుండా పాటించాలని కంపెనీ యాజమాన్యం కు చెప్పటం జరిగింది

## వినాయక చవితి వేడుకలకు ముస్తాబైన శ్రీ యోగి వేమన ఆలయం....






**గాండ్లపెంట సెప్టెంబర్ 11 సీమ వార్త....** మండల పరిధిలోని కటారుపల్లి గ్రామంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన శ్రీ యోగివేమన ఆలయం వినాయక చవితి వేడుకలకు ఘనంగా ముస్తాబవుతోంది. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేక అలంకరణలతో తీర్చిదిద్దుతున్నట్లు ఆలయ పీఠాధిపతి నంద వేమారెడ్డి తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణం కల్పించడంతో పాటు, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి నంద వేమారెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి పండుగను 14వ తారీకు నుంచి 18 వ తారీకు వరకు అనగా ఐదు రోజులపాటు వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. యోగివేమన ఆలయ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తున్నామని తెలిపారు. భక్తులు ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భక్తుల రాకపోకలకు అనుగుణంగా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. వినాయక చవితి సందర్భంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చే భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఐదు రోజుల పాటు ఆలయానికి వచ్చే భక్తుల కు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ పీఠాధిపతి తెలిపారు.

## 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొదటి స్థానంలో ఉండాలి

ఆర్డీవో రామ్మ భూపాల్ రెడ్డి



**ధర్మవరం సెప్టెంబర్ 11 సీమవార్త :** 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొదటి స్థానంలో ఉండాలి అని ఆర్డిఓ రామభూపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర 2047 లో భాగంగా డిస్టిక్ గ్రాస్ డొమెస్టిక్ ప్రోడక్ట్ , మండల డొమెస్టిక్ ప్రోడక్ట్ లపై ధర్మవరం నియోజకవర్గంలోని డివిజనల్ అధికారులకు అన్ని మండలాల మండల స్థాయి అధికారులకు ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ ఈ శిక్షణను పహేలే ఇండియా వారు ఇవ్వడం జరిగింది అని తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో మొదటి స్థానం చేరుకోవడానికి వివిధ శాఖల వారు అవసరమయ్యే ప్రణాళికలు రూపొందించి అందుకు అనుగుణంగా నిర్వహించవలసిన చేపట్టవలసిన కార్యక్రమాలు గురించి వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఎంపిడిఓ శకుంతల..




**అమడగూరు సీమ వార్త న్యూస్..**అమడుగురు మండలపరిధిలోని స్థానిక ఎం ఆర్ సి కార్యాలయంలో ఎంపీడీఓ శకుంతల ఆధ్వర్యంలో జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన శివశంకర్,ప్రసన్న కుమారి,జగదీష్ లకు మండల కేంద్రంలోని కార్యాలయంలో మరియు ఎంఆర్సి సిబ్బంది ఎంపీడీఓ వారి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పాఠశాలలఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తుంపర్తి కాలనీకి ప్రత్యేక వార్డు హోదా కల్పించాలి

ఆర్ఎస్పి పార్టీ రాష్ట్ర నాయకులు మంజుల నరేంద్ర, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సాకే వినయ్ కుమార్



**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 11 సీమవార్త :** తుంపర్తి కాలనీకి ప్రత్యేక వార్డు హోదా కల్పించాలని, ఇందుకు డెలిమిటేషన్లో విలీనం చేయాలని, ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆర్.ఎస్.పి పార్టీ రాష్ట్ర నాయకులు మంజుల నరేంద్ర, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సాకే వినయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సాకే వినయ్ కుమార్ మాట్లాడుతూ, ఆర్ఎస్పీ రాష్ట్ర నాయకులు మంజుల నరేంద్ర మాట్లాడుతూ సుమారు 1,500 పేద కుటుంబాలు నివసిస్తున్న తుంపర్తి కాలనీ అటు పంచాయతీకి, ఇటు మున్సిపాలిటీకి చెందకుండా ప్రజలు ఎటూ కాని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. జీవోలు, నిబంధనల పేరుతో అధికారులు కాలనీ విలీనాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వం చట్టపరమైన అధికారాలను వినియోగించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే కాలనీలో తాగునీరు, రహదారులు,వీధిలైట్లు, రేషన్, ప్రాథమిక పాఠశాల వంటి కనీస సౌకర్యాలు లేక వేలాది మంది పేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న సమస్యలకు సోషల్ మీడియాలో స్పందించే మంత్రి, వేలాది మంది పేదల సమస్యపై ఎందుకు స్పందించడం లేదని వారు ప్రశ్నించారు. ప్రజల అభ్యంతరాలను విస్మరించి ఏకపక్షంగా డెలిమిటేషన్ చేపడితే హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. అవసరమైతే దశలవారీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘాల శీను, నారాయణస్వామి, కనుమ దామోదర్, బీఎస్పీ--ఆర్ఎస్పీ ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మతల్లి దర్శనం



**ధర్మవరం సెప్టెంబర్ 11 సీమవార్త :** పట్టణంలోని సాలే వీధిలో వెలసిన శ్రీ పెద్దమ్మ తల్లి ప్రత్యేక అలంకరణలో భక్తాదులకు దర్శనమిచ్చారు. శ్రావణ అమావాస్య శుక్రవారం సందర్భంగా బుగ్గ వంశస్తుల ఆధ్వర్యంలో అర్చకులు వెంకటేష్ శర్మ అమ్మవారికి పంచామృతాభిషేకం విశేష మంగళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. తదుపరి పంచలోహాల కవచము పూలు తులసితో ప్రత్యేక అలంకరణ చేసిన వైనం భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది. తదుపరి మహిళలు అందరూ లలిత సహస్రనామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు.

## భక్తి.. సంస్కృతి.. పర్యావరణ పరిరక్షణ శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు వినాయక వేడుకలు

మట్టి వినాయకుడే ముద్దు.. పర్యావరణ పరిరక్షణే మా లక్ష్యం

పాటలు.. నృత్యాలు.. స్కిట్లతో సందడిగా చైతన్య పాఠశాల వినాయక వేడుకలు

వినాయక చవితి వేడుకల్లో పర్యావరణ పరిరక్షణ సందేశం

వేంపల్లి చైతన్య పాఠశాలలో ఘనంగా వినాయక చవితి ముందస్తు వేడుకలు



**వేంపల్లె, సెప్టెంబర్ 11, సీమవార్త :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వేంపల్లిలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో వినాయక చవితి ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడంతో పాటు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై వినాయకుని విశిష్టత, వినాయక చవితి ప్రాముఖ్యతను వివరిస్తూ పాటలు, నృత్యాలు, స్కిట్లు, ప్రసంగాలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బి. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ పండుగలను ఆనందంగా జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణహిత పద్ధతులను పాటించాలని పిలుపునిచ్చారు.విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే ప్రకృతి పట్ల బాధ్యత, పర్యావరణ స్పృహ పెంపొందించాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చైర్మన్ పేర్కొన్నారు. విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో పాఠశాల ముందుంటుందని తెలిపారు.విద్యార్థుల ప్రతిభను చైర్మన్ అభినందించడంతో పాటు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులను ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే భారీ జరిమానా

టూ టౌన్ సీఐ జయ నాయక్



**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 11 సీమవార్త :** పట్టణములో మద్యం సేవించి వాహనాలు నడిపితే వారి జేరిమానా విధించబడుతుందని టూటౌన్ సిఐ జయ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారిపై ధర్మవరం టూ టౌన్ పోలీసులు ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఈ క్రమంలో ఈ దినం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను పోలీసు సిబ్బంది అదుపులోకి తీసుకుని, వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. చేపట్టారు. అనంతరం వారిని 2వ తరగతి మేజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరుపరచగా, కోర్టు వారు ఒక్కొకరికి 10,000/- రూపాయల చొప్పున మొత్తంగా రూ.20,000/- జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. ధర్మవరం ×× టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## మట్టి వినాయకులను పూజిస్తాం, పర్యావరణాన్ని కాపాడుతాం..

కర్రేస్పాండెంట్ నరేంద్ర బాబు



**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 11 సీమవార్త :** మట్టి వినాయకులను పూజిస్తాం, పర్యావరణాన్ని కాపాడాలని కరెస్పాండెంట్ నరేంద్ర బాబు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సాయినగర్ లొ గల సూర్య హై స్కూల్ లొ వినాయక చవితి వేడుకలను కరెస్పాండంట్ వై నరేంద్ర బాబు ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. విద్యార్థులు మట్టివినాయకుని పూజించారు. మట్టి తో చేసిన వినాయకులను నిమజ్జనం చేయడం ద్వారా నీటి లోని జీవరశులు కు ప్రాణహాని ఉంటుంది అని విద్యార్థులు తెలియజేసారు. కెమికల్స్ తో చేసిన వినాయకులు వాడవద్దు అని తెలిపారు ఈ కార్యక్రమం లొ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యర్రగుడిపల్లిలో ప్రజా సమస్యలపై మున్సిపల్ ఇన్‌-చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి దృష్టి



**పులివెందుల సెప్టెంబర్ 11 (సీమ వార్త):** పులివెందుల పట్టణ పరిధిలోని యర్రగుడిపల్లి గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి స్థానిక ప్రజలను కలిసి అడిగి తెలుసుకున్నారు. ప్రజల వినతి మేరకు గ్రామంలో ప్రధానంగా నెలకొన్న తాగునీరు, యూజీడీ సమస్యలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు తమకు ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను సావధానంగా విన్న వైఎస్ మనోహర్ రెడ్డి, సంబంధిత అధికారులతో మాట్లాడి తాగునీరు, యూజీడీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హోల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, మాజీ కౌన్సిలర్ పురుషోత్తం, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు చంద్రమౌళి, ఎస్సీ నాయకులు కోళ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ రాం గోపాల్ రెడ్డి చొరవతో తీరిన తాగునీటి సమస్య

ఎమ్మెల్సీకి అభినందనలు తెలిపిన విద్యార్థినిలు



**పులివెందుల సెప్టెంబర్ 11 (సీమ వార్త):** 260 మంది బాలికల సమస్యను గుర్తించినా వెంటనే ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పరిష్కారం చూపారు. చక్రా ఓయపేట మండలంలోని కస్తూర్బా పాఠశాలలో తీవ్ర నీటి ఎద్దడి, అపరిశుభ్ర వాతావరణంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి శుక్రవారం స్వయంగా పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో... వెంటనే స్పందించిన అధికారులు పైపులైన్ ఏర్పాటు చేసి పాఠశాలకు నీటి సౌకర్యం కల్పించారు. అలాగే జేసీబీలతో పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేసి చదును చేశారు. సమస్య చెప్పడమే కాదు... పరిష్కారం చూపించడమే భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ప్రత్యేకత. విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ సత్యసాయి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి





**98 లక్షలకు గాను 34 లక్షల ఎకరాల్లో సాగు లేదు**

**పంట రుణాలు మాఫీ చేసి ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి**

**పుట్టపర్తి కలెక్టరేట్ ఎదుట రైతు సంఘాల ధర్నా**

**పుట్టపర్తి, సెప్టెంబర్ 11(సీమవార్త బ్యూరో) :** శ్రీ సత్యసాయి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పుట్టపర్తి కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మహాదేవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, చేతి వృత్తుల రాష్ట్ర అధ్యక్షుడు జింక చలపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ లో 98 లక్షల ఎకరాలకు గాను 34 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాలేదని, కంది, టమోటా, పత్తి, వేరుశనగ పంటలు ఎండిపోతున్నా యన్నారు. కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించి ప్యాకేజీ ఇవ్వాలని, రాష్ట్రం కరువు మండలాలుగా ప్రకటించి ఆహార పంటలకు రూ.10 వేలు, వాణిజ్య పంటలకు రూ.25 వేలు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట రుణాలు మాఫీ చేయాలని, కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని, పశుగ్రాసం, ఉపాధి హామీలో రూ.700 వేతనం, 16 రకాల రేషన్, నెలకు రూ.10 వేల కరువు పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.కదిరప్ప, నియోజకవర్గ కార్యదర్శి వినోద్, బాలస్వామి, కుల్లాయప్ప, ఈఎస్ వెంకటేష్, లింగన్న, చౌడప్ప, ఆదినారాయణ, ఆదిలక్ష్మి, గంగమ్మ, తిరుపాలు, రమేష్, నారాయణస్వామి, వెంకటేశు, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 10 రోజుల్లోగా పెండింగ్ ఈపిఎఫ్ ను చెల్లిస్తాం

**-పారిశుద్ధ్య కార్మికులతో చర్చించిన టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి**

**-కార్మికులకు పంచాయతీ అధికారులు, ఈపిఎఫ్ అధికారులు హామీ**



**వేంపల్లె, సెప్టెంబర్ 11, సీమవార్త :** వేంపల్లె పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు 36 నెలలకు సంబంధించి పెండింగ్ ఈపీఎఫ్ చెల్లించాలంటూ పారిశుద్ధ్య కార్మికులు సమ్మెకు దిగడంతో వేంపల్లె పట్టణంలో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతికల్లో చెత్త సేకరణపై వార్తలు ప్రచురితం కావడంతో అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి పారిశుద్ధ్య కార్మికులతో శుక్రవారం చర్చలు జరిపారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుని, పెండింగ్ ఈపీఎఫ్ కు సంబంధించిన సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడారు. అనంతరం డిప్యూటీ ఎంపిడిఓ రమణయ్య, జూనియర్ అసిస్టెంట్ శ్రీనువాసరావు, పారిశుద్ధ్య కార్మికులను తన వెంట కడపలోని పీఎఫ్ కార్యాలయానికి తీసుకెళ్లి ఈపీఎఫ్ అధికారులతో చర్చించారు. పారిశుద్ధ్య కార్మికులకు రావాల్సిన 36 నెలలకు చెందిన పెండింగ్ ఈపీఎఫ్ సమస్యను వివరంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించేందుకు 10 రోజుల గడువు ఇవ్వాలని, ఈ వ్యవధిలో పెండింగ్ ఈపీఎఫ్ ను చెల్లించి సమస్యను పరిష్కరిస్తామని ఈపీఎఫ్ అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య పనులు నిలిచిపోవడం వల్ల మరింత ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే విధుల్లోకి వెళ్లాలని రామమునిరెడ్డి పారిశుద్ధ్య కార్మికులను కోరారు. ఈపీఎఫ్ సమస్య పరిష్కారం కోసం తాను అధికారులతో నిరంతరం మాట్లాడుతానని, కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా 2025 ఎడాదికి సంబంధించి 3 నెలల వేతనాలు కూడ రాలేదని వాటి విషయంపై డిపిఓను కోరగా నూతనంగా వచ్చిన స్వర్ణ పోర్టల్ లో అప్ లోడ్ కావడం లేదు కాబట్టి జీతాలు ఇచ్చేందుకు వీలు కావడం లేదని పంచాయతీ రాజ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాల్సి ఉందని తెలిపినట్లు ఆయన చెప్పారు. బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి ద్వారా పంచాయతీ రాజ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి 3 నెలల జీతాలు కూడ మంజూరు చేయించేందుకు కృషి చేయడం జరుగుతుందని కార్మికులకు హామీ ఇచ్చారు. అధికారుల హామీ మేరకు పారిశుద్ధ్య కార్మికులు సమ్మె విరమించి విధుల్లోకి వెళ్లేందుకు అంగీకరించడంతో వేంపల్లె పట్టణంలో నిలిచిపోయిన పారిశుద్ధ్య పనులు తిరిగి ప్రారంభం కానున్నాయి. దీంతో పట్టణంలో పేరుకుపోయిన చెత్తను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

# విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంపొందించడమే జే వి వి లక్ష్యం



**వేంపల్లె, సెప్టెంబర్ 11, సీమవార్త :** విద్యార్థులలో శాస్త్రీయ దృకృథాన్ని, విజ్ఞానాన్ని పెంపొందించడమే జెవివి లక్ష్యం.. మండల విద్యాశాఖ అధికారి 1 శ్రీ వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ 1 మాట్లాడుతూ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా జన విజ్ఞాన వేదిక ఎన్నో టెస్టులు నిర్వహించి విద్యార్థుల్లోని జ్ఞానాన్ని, శాస్త్రీయ దృకృథాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందని వారన్నారు. ముఖ్యంగా మూఢనమ్మకాలను నమ్మకూడదని సైన్స్ మానవుని జీవితంలో ఒక భాగం అని ప్రతి విద్యార్థి గుర్తించాలన్నారు.. మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలకు 11 టీంలుగా పాల్గొన్నారు. వీటిలో ప్రైవేటు స్కూల్స్ ఆరు, ప్రభుత్వ పాఠశాలలు ఐదు టీములు పాల్గొన్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు శ్రీ చెరుకూరు శ్రీనివాస్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా జె వి లో ఒక కార్యకర్తగా పనిచేస్తున్నానని వివిధ పదవుల్లో సేవలు అందించడం జరిగిందని విద్యార్థుల్లో సైన్స్ ఎన్నో ఆలోచనలు పెంపొందిస్తుందని వారిని భావి భారత పౌరులుగా ముఖ్యంగా సైంటిస్టులుగా తయారు చేయడంలో ఇలాంటి సైన్స్ టాలెంట్ టెస్ట్ లు ఉపయోగపడతాయని వారన్నారు.. ప్రవేట్ స్కూల్ ల విభాగంలో మొదటి స్థానంలో శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రభుత్వ పాఠశాలల విభాగంలో పరిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు వచ్చారన్నారు... అలాగే రెండవ బహుమతికి గాను చైతన్య స్కూల్ మరో టీం విద్యార్థినులు అలాగే ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు... ఇక మూడవ బహుమతికిగాను ప్రైవేట్ పాఠశాలల విభాగంలో శ్రీ స్వామి వివేకానంద హై స్కూల్, విద్యార్థులు,అలాగే ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఏపీ రెసిడెన్షియల్ ఉర్దూ ఏపీ రెసిడెన్షియల్ మైనారిటీ విద్యార్థులు నిలిచారని వారు తెలిపారు.. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రధానం చేశారు.. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కేశవులు మాట్లాడుతూ విద్యార్థులు పార్టిసిపేట్ చేయడం ఒక అలవాటుగా చేసుకోవాలని విజయం అనేది ఏదో ఒకసారి తప్పనిసరిగా అందుబాటులోకి వస్తుందని వారన్నారు.. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెడ్మాస్టర్ శ్రీ శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## ఘనంగా జాతీయ హిందీ దినోత్సవం....




**గాండ్లపెంట సెప్టెంబర్ 11 సీమ వార్త.....** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ అధ్యక్షతన జాతీయ హిందీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈనెల 14వ తారీఖున హిందీ దినోత్సవాన్ని జరుపుకోవాలని ఆ రోజు వినాయక చవితి పండుగ నేపథ్యంలో ముందుగా ఈ కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులు తాహిర్ వలి, చిన్నప్పయ్య విద్యార్థులతో మాట్లాడుతూ స్వాతంత్ర సంగ్రామములో హిందీ భాష కీలకపాత్ర పోషించిందన్నారు. భారతదేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత 1949 సెప్టెంబర్ 14న రాజ్యాంగ ఆర్టికల్ 343(1) ప్రకారం హిందీని కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా గుర్తించినట్లు తెలిపారు. హిందీ భాష మన దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా ప్రాధాన్యత సంతరించుకుందని అదేవిధంగా ప్రతి సంవత్సరం జనవరి 10 వ తారీఖున అంతర్జాతీయ హిందీ దినోత్సవం నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పద్య పఠనము, చిత్రలేఖనం తదితర పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వనాథరెడ్డి, ఓబుల్ రెడ్డి, పేటీఎం మురాద్ షా వలి, నరసింహారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, రాజారత్నం, ప్రసన్న లక్ష్మి మరియు బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.
ఫోటో.... పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు.

## మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలి



**వేంపల్లె, సెప్టెంబర్ 11, సీమవార్త :** మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉష శ్రీ పిలుపునిచ్చారు. వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో శుక్రవారం వేంపల్లె పట్టణ పురవీధుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డా. కె. ఉష శ్రీ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల జల కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందన్నారు. మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా చూడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు కుమార్ రాజా, జనార్ధన్, వైస్ ప్రిన్సిపాల్ షాజియా బేగం, పీడీ తేజేంద్ర, అధ్యాపకులు హరిత, రాజా రెడ్డి, వీరారెడ్డి, వినోద్, శ్రీను, ఇతర అధ్యాపక బృందం, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జన విజ్ఞాన వేదిక టాలెంట్ టెస్ట్‌లో వేంపల్లి చైతన్య హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ




**వేంపల్లి:** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్ట్--2026 పరీక్షల్లో వేంపల్లి శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తున్న ఈ పోటీ పరీక్షల్లో భాగంగా సెప్టెంబర్ 11వ తేదీన మండల స్థాయిలో జరిగిన టాలెంట్ టెస్ట్ పరీక్షకు వేంపల్లి శ్రీ చైతన్య హైస్కూల్ నుండి ఆరుగురు విద్యార్థులు ఎంపికై పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులు బి ధర్మతేజ , ఎం.ధనుష, బి. గంగా ప్రియదర్శిని జిల్లా స్థాయి పోటీ పరీక్షలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు సెప్టెంబర్ 26వ తేదీన జిల్లా కేంద్రమైన కడపలో నిర్వహించనున్న తదుపరి స్థాయి పోటీ పరీక్షలో పాల్గొననున్నారు. విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తిని పెంపొందిం చుకోవడంతో పాటు పోటీ పరీక్షల్లో రాణించడం అభినందనీయమని పాఠశాల కరస్పాండెంట్ శ్రీ బి. చక్రపాణి రెడ్డి గారు తెలిపారు. విద్యార్థులను ఈ సందర్భంగా కరస్పాండెంట్ అభినందిస్తూ, జిల్లా స్థాయి పోటీలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## శ్రీ వృషభాచలేశ్వర దర్శించుకున్న తిరుపతి ప్రాంతీయ సంయుక్త కమిషనర్



**వేంపల్లె, సెప్టెంబర్ 11, సీమవార్త :** వేంపల్లె పాపాగ్ని నదీ తీరాన ఎద్దుల కొండపై వెలసిన శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మల్టీజోన్-2, తిరుపతి ప్రాంతీయ సంయుక్త కమిషనర్ శ్రీ బి.మహేశ్వర రెడ్డి స్వామివారిని శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆలయ ముఖ్య అర్చకులు శ్రీ హరి ప్రవీణ్ వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఆయన దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవస్థాన ప్రాంగణంలో భక్తులు సౌకర్యములు, అన్నదాన ప్రసాదము పంపిణీ మరియు మెరుగైన సౌకర్యములు కల్పించాలని ఆయన దృష్టికి ఆలయ ఈవో సుభాష్ తీసుకెళ్లారు. దేవస్థానం యొక్క ప్రాముఖ్యతను గురించిన ఫ్లెక్సీలు , హోర్డింగులు గండి క్షేత్రం మరియు ముఖ్య కూడలి ప్రాంతంలో యందు ఏర్పాటు చేయవలసిందిగా సూచించారు. తదుపరి ఆలయ ప్రాంగణము, భక్తుల ఆహ్లాద వాతావరణం కల్పించుటకు గాక పూల మొక్కలు పెంచవలసినదిగా మరియు దేవతా వృక్షములు పెంచవలసిందిగా ఆదేశించి యున్నారు. వేంపల్లి పట్టణం నందు నాలుగు రోడ్ల కూడలి లో గల దేవస్థానం కళ్యాణ మండపమును అభివృద్ధి పరచుటకు తగు నివేదికలు ఇంజనీరింగ్ వారికి పంపవలసిందిగా ఆదేశించారు.

# వేంపల్లె పట్టణానికి ఏమైంది..?





**రోడ్డు పనులతో నరకయాతన**

**ఒకవైపు రోడ్డు పనులు మరోవైపు ట్రాఫిక్ అంతరాయం**

**రోడ్డు పనులతో వేంపల్లిలో ట్రాఫిక్ కష్టాలు**

**విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులకు తప్పని తిప్పలు**

**ట్రాఫిక్ నియంత్రణపై ప్రయాణికులు, స్థానికులు అసంతృప్తి**

**వేంపల్లె, సెప్టెంబర్ 11, సీమవార్త** : రోడ్డు పనులతో వేంపల్లి పట్టణంలో ప్రజలకు నిత్యం నరకయాతన తప్పడం లేదు. ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు రద్దీలో చిక్కుకుని ఆలస్యమవుతుండగా.. ఉద్యోగులు సమయానికి కార్యాలయాలకు చేరేందుకు పరుగులు తీయాల్సి వస్తోంది. సాయంత్రం ఇళ్లకు తిరిగి వెళ్లే సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. పట్టణంలో రోడ్డు పనులతో అడుగడుగునా గమ్యానికి వెళ్లేందుకు, తిరిగి ఇళ్లకు చేరుకునేందుకు అవస్థలు పడుతున్నారు. వాహనదారులు ట్రాఫిక్ సమస్య భయంతో అత్యవసర వాహనాలు సైతం రద్దీలో చిక్కుకునే పరిస్థితి నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేంపల్లెలో జరుగుతున్న రోడ్డు పనుల కారణంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పనులతో వాహనదారులు నెమ్మదిగా ముందుకు కదులుతున్నారు. ఒకవైపు బస్సులు, ఆటోలు, కార్లు బారులు తీరడం.. మరోవైపు ద్విచక్ర వాహనదారులు ఇరుకైన మార్గాల్లో దారి వెతుక్కోవడం నిత్య దృశ్యంగా మారింది. రద్దీలో చిక్కుకున్న ప్రయాణికులు అసహనంతో నిట్టూర్పులు విడుస్తుండగా, చిన్నారులు, వృద్ధులు దుమ్ము, ట్రాఫిక్ మధ్య తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకలు స్తంభించడంతో గమ్యస్థానాలకు చేరుకోవాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంక్షలు ఉన్నాయి.. ట్రాఫిక్ నియంత్రణ ఏదీ? సాయంత్రం వేళల్లో జంక్షన్ వద్ద తోపుడు బండ్లు పెట్టకూడదంటూ పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చలనాలు విధిస్తున్నప్పటికీ, వాహనాలు కదలక రోడ్డుపైనే నిలిచిపోయిన వేళ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు మాత్రం కనిపించడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గమ్యస్థానం కళ్లముందే ఉన్నా.. రద్దీ దాటేందుకు నిమిషాల ప్రయాణం గంటలుగా మారుతోంది. రోడ్డు పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనులను వేగవంతం చేసి రహదారులను అందుబాటులోకి తేవడంతో పాటు, రద్దీ సమయాల్లో ప్రత్యేక ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## చెకుముకిలో ముగ్గురు శ్రీ చైతన్య విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక

**వేంపల్లె, సెప్టెంబర్ 11, సీమవార్త** : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్--2026 మండల స్థాయి పరీక్షల్లో వేంపల్లి శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారని శ్రీ చైతన్య పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు నిర్వహించిన ఈ పరీక్షకు పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో బి. ధర్మతేజ, ఎం. ధనుష్, బి. గంగా ప్రియదర్శిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. జిల్లా స్థాయి పరీక్షను సెప్టెంబర్ 26న కడపలో నిర్వహించడంతో ఈ ముగ్గురు చెకుముకి పరీక్షల్లో పాల్గొంటారు. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంపొందించడంతో పాటు పోటీ పరీక్షల్లో రాణించడం అభినందనీయమన్నారు. జిల్లా స్థాయి పోటీలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## క్రీడా రంగంలో జ్ఞానబోధిని పాఠశాల విద్యార్థుల ప్రతిభ.




**పావగడ సెప్టెంబర్ 11 సీమ వార్త** పావగడ:: 17 ఏళ్ల వయోపరిమితి విద్యార్థుల హోబళీ స్థాయి క్రీడా పోటీల్లో 2026-27 సంవత్సరానికి పట్టణంలోని జ్ఞానబోధిని పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శనతో పాఠశాలకు కీర్తి తెచ్చారు.100 మీ. పరుగు, లాంగ్ జంప్‌లో కీర్తన ప్రథమ స్థానం, 200 మీ. పరుగులో దీపికా ప్రథమ స్థానం, 400 మీ. పరుగులో శ్రీనికా ఎం ప్రథమ స్థానం, డిస్క్ త్రోలో మౌనికా ద్వితీయ స్థానం, వాకింగ్ రేస్‌లో రిషి మంజునాథ్ ద్వితీయ స్థానం, ఉదయ్ కుమార్ తృతీయ స్థానం, గ్రూప్ గేమ్ వాలీబాల్‌లో ప్రథమ స్థానం సాధించారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కార్యదర్శి డా. కె.ఎస్. అనిల్ కుమార్, ప్రధానోపాధ్యాయులు, సహ ఉపాధ్యాయులు, సిబ్బంది హృదయపూర్వకంగా అభినందించారు

## ఘనంగా పట్టణ యువజన విభాగం అధ్యక్షుని పుట్టినరోజు వేడుకలు




**మడకశిర సెప్టెంబర్ 11 సీమ వార్త** పట్టణ యువజన విభాగం అధ్యక్షులు ఎస్.బాబు పుట్టినరోజు వేడుకలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు శుక్రవారం నియోజకవర్గం సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీరాములు, పట్టణ కన్వీనర్ ఓం కుమార్,రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి నాగభూషన్ రెడ్డి,రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి తిప్పే స్వామి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి నరసింహ, జిల్లా సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు నగేష్, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, మడకశిర నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు శేషాద్రి,పట్టణ స్టూడెంట్ వింగ్ అధ్యక్షులు వసీం బేగ్, వికలాంగుల అధ్యక్షులు జేబీవుల, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు హరి, పట్టణ పబ్లిక్ సిటీ వింగ్ అధ్యక్షుడు రఘునందన్, మండల మైనార్టీ వింగ్‌అధ్యక్షులు చంద్ బాషా ,గౌడనహల్లి రఘు,బులు సముద్రం ఓబులేష్ వైకాపా నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## పావగడలో పిల్లలచేత పర్యావరణ హిత గణేష్ విగ్రహాల తయారీ పోటీ.



**పావగడ సెప్టెంబర్ 11 సీమ వార్త.** పావగడ:: తాలూకా బాలభవన్ సమితి, శిశు అభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని గురుభవన్‌లో పాఠశాల విద్యార్థుల కోసం బంక మట్టితో పర్యావరణ హిత గణపతి విగ్రహాలను తయారు చేసే వినూత్న పోటీని నిర్వహించారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి బి. ఆర్. సి జి. వెంకటేష్ మాట్లాడుతూ, బంక మట్టితో విగ్రహాలను తయారు చేయడం ద్వారా పిల్లల్లో కళా నైపుణ్యాన్ని పెంపొందించడం, పర్యావరణ హిత గణేష్ పండుగ గురించి అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. పండుగ భక్తి, సంబరాలు ప్రకృతికి హాని కలిగించకూడదు. అందుకే ప్రజలు సహజ మట్టి గణపతి విగ్రహాలను వాడి పర్యావరణాన్ని కాపాడేందుకు సహకరించాలని కోరారు. ఉపాధ్యాయుడు రామచంద్ర చార్ మాట్లాడుతూ, ఈ తరం యువత ప్రతిష్ట కోసం పీఓపీతో చేసిన పెద్ద పెద్ద విగ్రహాలను పెట్టి, లౌడ్ స్పీకర్లు, డీజేలు వాడి శబ్ద కాలుష్యం చేస్తున్నారని, భక్తికి విగ్రహం చిన్నదైనా పర్వాలేదు, పర్యావరణానికి హాని కలగకుండా స్వచ్ఛమైన మట్టితో చిన్న విగ్రహాన్ని చేసి పూజించాలని సూచించారు. పోటీలో వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు బంక మట్టితో రకరకాల గణేష్ విగ్రహాలకు రూపమిస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు. మొత్తంగా చిన్నారుల ఈ పర్యావరణ హిత అడుగుకు ప్రజల నుండి విస్తృత ప్రశంసలు లభించాయి. కార్యక్రమంలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తాలూకా శిశు అభివృద్ధి అధికారి సునీతా డి.జి, ఉపాధ్యాయులు నస్రీన్, గోపాల్, లోకేష్, శిశు అభివృద్ధి శాఖకు చెందిన విజయలక్ష్మి, హరీష్, హనుమక్క, ప్రీతి తదితరులు హాజరయ్యారు.

## పెన్షన్ దరఖాస్తుల గడువు పొడిగించాలి

**లిప్రభుత్వానికి ఆర్‌సీపీ నాయకుల వినతి**



**ఓబులదేవరచెరువు, (సెప్టెంబర్11)సీమ వార్త**:పెన్షన్ల కోసం ప్రభుత్వం విధించిన గడువును మరో 20 రోజులు పొడిగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీ)పుట్టపర్తి డివిజన్ కార్యదర్శి షేక్ మున్నా,మండల కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో శివరాం ప్రసాద్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.ప్రస్తుతం పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన గడువు తక్కువగా ఉండటంతో పాటు, అనేక మంది నిరక్షరాస్యులు కావడంతో అవసరమైన పత్రాలను సకాలంలో సమకూర్చుకోవడం కష్టంగా మారిందన్నారు. ముఖ్యంగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని పేర్కొన్నారు.వినాయక చవితి పండుగ నేపథ్యంలో వరుస సెలవులు రావడం కూడా దరఖాస్తుదారులకు ఇబ్బందిగా మారిందన్నారు. మరోవైపు సచివాలయాల్లో సర్వర్లు సరిగా పనిచేయకపోవడం, కొన్నిచోట్ల సిబ్బంది నుంచి తగిన సహకారం అందకపోవడంతో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయకుండానే వెనుదిరుగుతున్నారని ఆర్‌సీపీ నాయకులు ఆరోపించారు.పెన్షన్ పొందేందుకు అర్హత ఉన్న ఏ ఒక్కరూ గడువు కారణంగా అవకాశాన్ని కోల్పోకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పెన్షన్ దరఖాస్తుల గడువును మరో 20 రోజులు పొడిగించడంతో పాటు, సచివాలయాల్లో సర్వర్ సమస్యలను పరిష్కరించి, లబ్ధిదారులకు సిబ్బంది పూర్తి సహకారం అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ మండల కమిటీ నాయకులు వెంకటేశు, శాంతమ్మ,ఓడీసీ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్ కుమార్,పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ విజయవంతం.

**పెనుకొండ సెప్టెంబర్ 11సీమవార్త.** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షను ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల లో డివిజన్ కన్వీనర్ ఎంకే నభి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు రాఘవయ్య, సుధాకర్ లు బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లతా, యూటీఎఫ్ నాయకులు సుధాకర్ లు అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పేపర్లను ఆవిష్కరించి 13 పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులందరికీ మండల స్థాయి పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలోమొదటి స్థానంలో జ్ఞాపిక, పూజ, మౌనిక, ప్రవేట్ పాఠశాల నుండి అమూనాలులు, అక్షర గగన్ రెడ్డి,రసజ్ఞ విద్యార్థులు గెలుపొందారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు తదుపరి నిర్వహించే జిల్లా స్థాయిలో జరిగే చెకుముకి పరీక్షకు పంపడం జరుగుతుందని నిర్వాహకులు నభి, సుధాకర్ లు తెలియజేశారు ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎంకే నభి, మండల విద్యాశాఖ అధికారులు రాఘవయ్య సుధాకర్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లతా, యుటిఎఫ్ నాయకులు సుధాకర్, నారాయణస్వామి మరియు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది. గెలుపొందన విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక తరపున అట్టలు పెన్నెలు, మండల స్థాయి సర్టిఫికెట్ ను అందజేశారు.



## పార్థివదేహానికి ఘననివాళి



**టి. సుండుపల్లి సెప్టెంబర్ 11సీమ వార్త** మండల పరిధిలోని జి రెడ్డివారిపల్లి గ్రామపంచాయతీలోని కొరివి వాండ్లపల్లికి చెందిన బినేని రెడ్డప్ప తండ్రి బినేని వెంకటరమణ మృతి చెందడంతో ఆయన పార్థివదేహానికి జనసేన పార్టీ సీనియర్ నాయకులు రామా శ్రీనివాస్ బలిజ సంఘం అధ్యక్షులు గోవిందు రామయ్య నివాళు లుర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వెంకటరమణ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

## డిపో సమస్యలు తీర్చాలని ఆర్టీసీ అధికారికి వినతి



**మడకశిర సెప్టెంబర్ 11 సీమ వార్త** జాయింట్ ఆఫ్ కౌన్సిల్ ఏజెండాను ఏపీ పి టి డి ఎంప్లాయిస్ యూనియన్ డిపో కమిటీ డిపో మేనేజర్ . రామకృష్ణ కి ఎజెండా సమర్పించి. మడకశిర డిపో నందు నెలకొన్న అనిత్య సమస్యలపై పరిష్కార మార్గాలు చూపాలి అని తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ మహేష్ గ ఆర్టీసీ ఉద్యోగులు వారి ఇంక్రిమెంట్లు గురించి అడిగితే ఆయన ఉద్యోగులపై ఆవేశంతో ఊగిపోతూ ఇచ్చే సమాధానం సరిగా లేనందున ఉద్యోగులు భయాందోళనలకు గురవుతున్నారు. ఆయనపై తగు క్రమశిక్షణ చర్యలు తీసుకొని ఆయన ప్రవర్తనపై మార్పులు తీసుకురావాలి. 1/19 సర్క్యులర్ యధావిధిగా కొనసాగించాలి. బస్సులు స్క్రాప్ అయితే వాటి స్థానములో సర్వీసులు కూడా స్క్రాప్ చేస్తున్నారు. ఇప్పటికే మడచిన డిపోలో నాలుగు సర్వీస్ లను పూర్తిస్థాయిలో రద్దు పరచారు. హిందూపురం మడకశిర బళ్లారి , 2. హిందూపురం మడకశిర చిత్రదుర్గం ఏఎంపి6 ఓటీ హిందూ పురశీ స్పెషల్ ఆఫ్ ఇవి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పూర్తిస్థాయిలో నడపడానికి నూతన బస్సులను అందజేయాలి. ప్రయాణికులు పెరిగిపోవటం వలన బస్సుల సంఖ్యను కూడా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, ఆర్టీసీ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని మనవి ఆరోగ్యం సరిగా లేని వారికి మానవతా దృక్పథంతో డిపోలో ఉన్న ఖాళీలను వారికి కోడి లాగా అవకాశం కల్పించాలి. విశ్రాంతి గదులలో పరిశుభ్రతగా ఉంచాలి, నీళ్ల సౌకర్యాన్ని కల్పించాలి. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కే ర్ లీవులు, వెటర్నరీ లీవులు వారికి అనుకూలంగా ఇవ్వాలి. 8.1 /2019 సర్క్యులర్ ప్రతి డిపో లో యూనిఫారం మాదిరిగా అమలు పరుస్తామని డిపో మేనేజర్ తెలిపారు. అనేక సమస్యలు శాంతియుత వాతావరణం లో చర్చలు సఫలమయ్యాయి. రెండవ మంగళవారం మడకశిర డిపో నందు గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పి టీడీ ఉద్యోగుల్లో నెలకొన్న శాంతిని దూరం చేసి పారిశ్రామిక శాంతిని నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్షులు జి. ఎండీ. రఫీక్, డిపో కార్యదర్శి పీ రంగనాథ్ , గ్యారేజ్ కార్యదర్శి కే.టి స్వామి, నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి కడియప్ప, డిపో అధ్యక్షులు ముద్దప్ప, జయ సింహ, నరేందర్ గౌడ్, శివకుమార్, పి డీ సెక్షన్ సూపర్డెంట్ ఉల్లిగమ్మ, ట్రాఫిక్ ఇంచార్జ్ హనుమంతరాయ, అకౌంట్ సెక్షన్ సుబ్బయ్య గౌడ , అజీజ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ విజయవంతం



**మడకశిర సెప్టెంబర్ 11 సీమ వార్త** మండలంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు--2026 కార్యక్రమాన్ని ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు భాస్కర్ , నరసింహమూర్తి ,ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిరీన్ , ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి డి. మారుతి ప్రసాద్, జిల్లా కార్యదర్శి వీజీ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకుని, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్ట్ విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు, భవిష్యత్తులో ఎదుర్కొనే వివిధ పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల స్థాయిలో ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులను జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక చేశారు. విజేతలు మడకశిర మండలం -- ప్రభుత్వ పాఠశాలల విభాగం: జడ్పీహెచ్ఎస్ మనూరు విద్యార్థుల బృందం ప్రథమ స్థానం సాధించింది. మడకశిర మండలం -- ప్రైవేట్ పాఠశాలల విభాగం: శ్రీ సిద్ధార్థ విద్యానికేతన్ విద్యార్థుల బృందం ప్రథమ స్థానం సాధించింది. రొళ్ల మండలం -- ప్రభుత్వ పాఠశాలల విభాగం: అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల బృందం ప్రథమ స్థానం సాధించింది. ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సైన్స్ ఉపాధ్యాయులు ఎర్రమల, రమేష్ నాయక్, మహేష్, రాజగోపాల్, మారుతి, దేవరాజు తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేయండి.





:-మావటూరు రైతులు.

**పెనుకొండ సెప్టెంబర్ 11సీమవార్త.** మండల పరిధిలోని మావటూరు గ్రామానికి చెందిన రైతులు?వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని,నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేయాలని కోరారు.శుక్రవారం పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏడి శేషగిరి రావు ను రైతులు సుధాకర్ రెడ్డి, నాగరాజు, మారుతీ, మురళీ తదితరులు కలసి తమ సమస్యలను వివరించారు. ప్రస్తుతం ఉన్న 5 ఎంవిఏ ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్ అవుతున్నందున, లో-వోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు మరో 5 ఎంవిఏ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని తెలియ జేశారు.రోజూ ఇచ్చే 9 గంటల విద్యుత్ సరఫరాలో లోడ్ రిలీఫ్ పేరుతో పదే పదే విద్యుత్ కోతలు విధిస్తున్నారని, ఫలితంగా రోజుకు 2 నుండి 3 గంటలు కూడా సరిగా కరెంట్ అందడం లేదని తెలియజేశారు . సాగు చేసిన పంటలకు విద్యుత్ సరఫరా లేక నీరందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు పంట నష్ట పోయే అవకాశం వుందని తెలిపారు. ఉదయం పూట విద్యుత్ సరఫరా ఇచ్చినా కేవలం 230 వోల్టు మాత్రమే వస్తోందని, దీనివల్ల మోటార్ల నుండి సరైన నీటి అవుట్‌పుట్ రావడం లేదని రైతులు తెలిపారు. కేబుళ్ళు, స్టార్టర్లు కాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతోందని తెలిపారు .రైతుల సమస్యలపై స్పందించిన విద్యుత్ శాఖ అధికారి మాట్లాడూ, ఓవర్‌లోడ్ సమస్య ఉన్న మాట వాస్తవమేనన్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఇప్పటికే అంచనాలు సిద్ధం చేసి పైఅధికారులకు పంపామని తెలిపారు. ఆడిట్ ఇతర సాంకేతిక ప్రక్రియల వల్ల కొంత ఆలస్యమైనప్పటికీ, వీలైనంత త్వరగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుమతి ఇప్పించి సమస్యను పరిష్కరిస్తామని రైతులకు తెలిపారు.

# రాజకీయాలకు అతీతంగా పేద ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం

- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

**కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 11 సీమవార్త** పేద, బడుగు బలహీనవర్గాల ప్రజలకు అండగా నిలిచి సంక్షేమ పథకాలను అమలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం ప్రజావేదికలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద 14 మంది బాధితులకు రూ.14,48,846 విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో బడుగు, బలహీనవర్గాల ప్రజలు అధికంగా ఉన్నందున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీకి చెందిన బాధితులకు సైతం సీఎంఆర్ఎఫ్ అందిస్తున్నామని, ప్రజావేదికకు ఏ పార్టీకి చెందిన వారు వచ్చినా వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.
డీఎస్సీ నియామకాలపై ఎలాంటి విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అసత్య ఆరోపణలు చేస్తున్న వారు వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. 16,340 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి అనేక కుటుంబాల్లో వెలుగులు నింపిన ఘనత యువ నాయకుడు నారా లోకేష్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. రూ.5,300 కోట్లతో వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అంకితం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ఎవరెన్ని పాదయాత్రలు, యాత్రలు చేసినా ప్రజల ఆశీర్వాదంతో తిరిగి కూటమి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



ఇండియా టుడే సర్వేలోనూ కూటమి మరో రెండు ఎంపీ స్థానాలను కైవసం చేసుకునే అవకాశం ఉందని వెల్లడైనట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, మండల పార్టీ కన్వీనర్లు, మార్కెట్‌యార్డు చైర్మన్, డైరెక్టర్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గజ్జల ఈశ్వరయ్య




**పులివెందుల సెప్టెంబర్ 11( సీమ వార్త)** 2009 విద్యాహక్కు చట్టం నిబంధనలను ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు పకడ్బందీగా అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గజ్జల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పులివెందుల పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాహక్కు చట్టం ప్రకారం అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందించాల్సి ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని పలు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఈ నిబంధనలు అమలు కావడం లేదని ఈశ్వరయ్య ఆరోపించారు. పులివెందులలోని విద్య సంస్థలు కార్పొరేట్ విద్య సంస్థలు మరియు రాష్ట్రంలోని పలు విద్యాసంస్థల్లో నిబంధనల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. జర్నలిస్టుల పిల్లలకు విద్యాహక్కు చట్టం కింద కల్పించాల్సిన ప్రయోజనాల విషయంలో కూడా సమస్యలు ఎదురవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా తగిన స్పందన లేదని ఆరోపించారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయని విద్యాసంస్థలపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు, అవసరమైతే వాటి గుర్తింపును రద్దు చేసే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం అమలుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు, జర్నలిస్టులు కలిసి ప్రజా ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందని గజ్జల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు.

## రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

మావటూరు రైతుల విజ్ఞప్తి



**పెనుకొండ సెప్టెంబర్ 11 తెలుగు స్వరం:** వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మావటూరు గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పెనుకొండ విద్యుత్ శాఖ ఏడీ శేషగిరిరావును కలిసి సమస్యలను వివరించారు. ప్రస్తుతం ఉన్న 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్ అవుతుండటంతో లోఓల్టేజీ సమస్య ఏర్పడుతోందని, అదనంగా మరో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. తరచూ విద్యుత్ కోతలతో పంటలకు నీరందక నష్టపోతున్నామని తెలిపారు. రైతుల సమస్యలపై స్పందించిన ఏడీ శేషగిరిరావు ఓవర్‌లోడ్ సమస్య ఉన్నట్లు అంగీకరించారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకుఇప్పటికే అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. సాంకేతిక ప్రక్రియ పూర్తయిన వెంటనే అనుమతులు తీసుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, నాగరాజు, మారుతి, మురళి. రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల దరఖాస్తు గడువు పొడిగించాలి

జిల్లా మాల మహానాడు నాయకుల విజ్ఞప్తి




**పెనుకొండ సెప్టెంబర్ 11 తెలుగు స్వరం:** ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లకు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించాలని శ్రీ సత్యసాయి జిల్లా మాల మహానాడు నాయకులు ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మాల మహానాడు జిల్లా అధ్యక్షులు డా. చెరుకూరి గంగులయ్య, ఎం.ఎన్. మూర్తి, ప్రధాన కార్యదర్శి కె. సోము కుమార్ మాట్లాడుతూ.. డప్పు, చర్మకారులు, ఉరుము, కొమ్ము తదితర సాంప్రదాయ కళాకారులకు గుర్తింపు కార్డు లేకపోయినా స్వీయ ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లిన పలువురు కళాకారులకు వెబ్ ఆప్షన్‌లో సంబంధిత వృత్తులు కనిపించకపోవడంతో దరఖాస్తులు తిరస్కరిస్తున్నారని తెలిపారు. సాంకేతిక సమస్యను వెంటనే పరిష్కరించి సచివాలయ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పెన్షన్ల దరఖాస్తులకు కేవలం పది రోజుల గడువు ఇవ్వడంతో పాటు మధ్యలో గణేష్ పండుగ సెలవులు రావడంతో అర్హులైన పలువురు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించేలా గడువును మరో పది రోజులు లేదా ఈ నెలాఖరు వరకు పొడిగించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయులును మాల మహానాడు నాయకులు విజ్ఞప్తి చేశారు.

## వ్యాపారాలపై....బూదిలి విద్యార్థులకు అవగాహన.

.... ఒకేషనల్ ట్రైనర్ ప్రమీల ఆధ్వర్యంలో కార్యక్రమాలు.




**గోరంట్ల సెప్టెంబర్ 11 సీమ వార్త** ఈ ఇండస్ట్రియల్ విజిట్లో భాగంగా రిటైల్ వ్యాపారాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సందర్భంగా మండలంలోని బూదిలి హై స్కూల్ కు చెందిన తొమ్మిదవ తరగతి మరియు 10వ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ ట్రైనర్ ప్రమీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా గోరంట్ల పట్టణంలోని రిటర్న్ వ్యాపార దుకాణాలు, టెక్స టైల్స్ దుకాణంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాల్లో భాగంగా వస్తువుల ఎంఆర్పి, జీఎస్టీ తోపాటు రిటైల్ వ్యాపారం లో భాగంగా కస్టమర్లతో ఎలా వ్యవహరించాలి అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం శ్రీనివాస్ రెడ్డి, ఒకేషనల్ ట్రైనర్ ప్రమీల, యమునా, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చెకుముకి పరీక్షలలో.....జిల్లా స్థాయికి ఎంపికైన... గోరంట్ల విద్యార్థినులు.




**గోరంట్ల సెప్టెంబర్ 11 సీమ వార్త** జిల్లా విద్యా శాఖ అధికారి, శ్రీ సత్య సాయి జిల్లా ఆదేశాల మేరకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పరీక్షలు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, గోరంట్ల లో జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలల నుంచి 8,9 ఢ 10 తరగతుల నుండి ఒక్క విద్యార్థి చొప్పున ముగ్గురు కలసి గ్రూప్ గా పాల్గొనడం జరిగింది. విద్యార్థుల లో శాస్త్రీయ వైఖరిని పెంపొందించి, మూఢ నమ్మకాల పై అపోహలు తొలగించే విధంగా జన విజ్ఞాన వేదిక పని చేస్తోందని ప్రధానోపాధ్యాయులు కవిత పేర్కొన్నారు. మండల స్థాయి పరీక్షలలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు శ్వేత, నిఖిల, మేఘన జిల్లా స్థాయి కి ఎంపిక అయ్యారు. విజేతలకు జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు మరియు యూ.టి. ఎఫ్ప్రధానకార్యదర్సులు చాంద్ బాషా, నాగేష్ జామెట్రీ బాక్సులు, పాల్గొన్న విద్యార్థులు అందరికీ పెన్నులు మరియు ప్రశంసా పత్రాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల ల ఉపాధ్యాయులు అనసూయ, హేమావతి, పెద్దారెడ్డి, బాలాజీ నాయక్ లు పాల్గొన్నారు.

## 30 ఏళ్ల కు ఫలించిన కల... రామచంద్రప్పకు బెస్ట్ అవార్డు.

అభినందించిన సత్కరించిన......బాయ్స్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,




**గోరంట్ల సెప్టెంబర్ 11 సీమ వార్త.** జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా ఉపాధ్యాయ అవార్డును అందుకున్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, గోరంట్లకు చెందిన స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) రామచంద్రప్పను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ఈశ్వర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. రామచంద్రప్ప గత 30 సంవత్సరాలుగా వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా సేవలందిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి విద్యా, వ్యక్తిత్వ వికాసానికి విశేష కృషి చేశారు. ఆయన అందించిన సుదీర్ఘ సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసి అవార్డుతో సత్కరించడం పట్ల పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, గోరంట్లలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో రామచంద్రప్పను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి. ఈశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా విద్యారంగానికి అంకితభావంతో సేవలందించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందడం పాఠశాలకు, తోటి ఉపాధ్యాయులకు గర్వకారణమని అన్నారు. రామచంద్రప్ప సేవలు విద్యార్థులకు, తోటి ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. విద్యార్థులు సైతం తమ గురువు సాధించిన ఈ ఘనత పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలలో వైసిపి పోరాడి గెలవాలి





--కూటమి ప్రభుత్వంపై విమర్శలు.. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

-- స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజాభిమానం చూరగొనండి

-- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

**కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 11 సీమవార్త** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ శ్రేణులను సమాయత్తం చేసే దిశగా కళ్యాణదుర్గంలో ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపీ, నియోజకవర్గ సమన్వయకర్త డా. తలారి రంగయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. డబ్బున్నవారే ఎన్నికల్లో గెలుస్తారన్న అపోహను పార్టీ శ్రేణులు వీడాలని సూచించారు. ప్రజల్లోకి వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని పిలుపునిచ్చారు. తమ పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తే కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాలతో పాటు మున్సిపాలిటీపై వైసీపీ జెండా ఎగురవేయవచ్చని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో కార్యకర్తలకు పార్టీలో ప్రాధాన్యం పెంచి, వారిని నాయకులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేసిన ఆయన.. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఐదు లక్షల పింఛన్లు తొలగించారని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కొత్త హామీలు, కార్యక్రమాలతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. డా. తలారి రంగయ్య మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కూటమి పాలనలో అభివృద్ధి పేరుతో అవినీతి, అక్రమాలు జరుగు తున్నాయని ఆరోపించారు. బెల్ట్ షాపులు, ఇసుక వ్యవహారాలే ప్రభుత్వ అభివృద్ధికి నిదర్శనంగా మారాయని విమర్శించారు. నియోజకవర్గంలో ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించారా అని ప్రశ్నించారు. చెరువులకు నీరు అందే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, ప్రజా సమస్యలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంపై సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో పరిశీలకుడు మహిందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, నియోజకవర్గ నాయకులు దొడగట్ట నారాయణ, న్యాయవాది హనుమంత రెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మండల కన్వీనర్లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేస్తాం





కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.

**పుట్టపర్తి డెస్క్, సెప్టెంబర్ 10 తెలుగు స్వరం.** అర్హులైన పేదలందరికీ ఇంటి పట్టాలు ఈనెల చివరన పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కదిరి పట్టణంలోని 17వ వార్డు గజ్జలరెడ్డిపల్లి గ్రామంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్నినిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొని, 17వ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను స్వయంగా పరిశీలించి, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగాప్రధానంగా ఇళ్ల స్థలాలు, ఇంటి పట్టాల కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో అర్జీలు అందజేశారు. ఎమ్మెల్యేమాట్లాడుతూత్వరలోనే అర్హులైన వారికి ఇంటి పట్టాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే విద్యార్థులు రోడ్డు దాటే సమయంలోఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారుల అధికారులతో మాట్లాడి బ్రిడ్జి ఏర్పాటు చేయడానికి, గ్రామంలో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గజ్జలరెడ్డిపల్లి నుంచి గరుడతీర్థం వరకు ఆక్రమణలకు గురైన రహదారిని పరిశీలించి, సమస్యను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు రాకపోకల సౌకర్యం కల్పించేలా అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అభినందనలు తెలిపారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను ధ్యేయంగా తీసుకొని పనిచేస్తున్నట్లు తెలిపారు. దీంతోపాటు టిడికో ఇల్లు కూడా మరమ్మతం చేసి అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. మఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నీ “వందనం” నీకే “బాబా”.

..తల్లికి వందనం డబ్బులు తిరిగి అందజేసిన మంచి మనసున్న ఉప్పర రామచంద్ర

-విద్యార్థి ఖాతాలో జమ కావాల్సిన నగదు పొరపాటున వేరే ఖాతాలో జమ..

-ప్రధానోపాధ్యాయుల చొరవతో విద్యార్థి తల్లిదండ్రులకు అందజేత

**గోరంట్ల సెప్టెంబర్ 11 సీమ వార్త** గోరంట్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాబా ఫక్రోద్దీన్‌కు సంబంధించిన తల్లికి వందనం పథకం నగదు విద్యార్థి తల్లిదండ్రుల ఖాతాలో జమ కావాల్సి ఉండగా, పొరపాటున హిందూపురం పట్టణానికి చెందిన ఉప్పర రామచంద్ర ఖాతాలో జమ అయింది. ఈ విషయం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ఈశ్వర్ ప్రసాద్ దృష్టికి రావడంతో ఆయన చొరవ తీసుకుని ఉప్పర రామచంద్రను సంప్రదించారు. విషయం తెలుసుకున్న ఉప్పర రామచంద్ర ఎలాంటి సంకోచం లేకుండా, తన ఖాతాలో పొరపాటున జమ అయిన తల్లికి వందనం పథకం నగదును పాఠశాల ఉపాధ్యాయుల చేతికి తిరిగి అందజేశారు. తనకు చెందని డబ్బును తిరిగి అందజేసి నిజాయితీ, మానవత్వాన్ని చాటుకున్న ఉప్పర రామచంద్రను ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ఈశ్వర్ ప్రసాద్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. నేటి సమాజంలో ఇతరులకు చెందాల్సిన నగదును తిరిగి అందజేసిన ఆయన మంచి మనసు అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం తల్లికి వందనం పథకం ద్వారా అందాల్సిన నగదును విద్యార్థి బాబా ఫక్రోద్దీన్ తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయుల కు, ఉపాధ్యాయులకు, ముఖ్యంగా మంచి మనసుతో నగదును తిరిగి అందజేసిన ఉప్పర రామచంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.



# జాతీయ స్థాయిలో వినియోగదారుల సంఘాల బలోపేతమే లక్ష్యం

**పుట్టపర్తిలో సెప్టెంబర్ 12, 13న 16వ జాతీయ వినియోగదారుల సదస్సు**



**పుట్టపర్తి, సెప్టెంబర్ 11:సీమ వార్త** దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారుల సంఘాలను బలోపేతం చేయడం, వినియోగదారుల హక్కుల పరిరక్షణకు మరింత సమర్థవంతమైన కార్యాచరణ రూపొందించడం, వినియోగదారుల పరిరక్షణ చట్టాలు మరియు హక్కులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా కన్స్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ , న్యూఢిల్లీ మరియు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో 16వ జాతీయ వినియోగదారుల సదస్సు సెప్టెంబర్ 12, 13 తేదీల్లో పుట్టపర్తిలో నిర్వహిస్తున్నట్లు సి సి సి చైర్మన్ శ్రీ అభిషేక్ శ్రీవాస్తవ్ మరియు క్యాప్కో చైర్మన్ శ్రీ జి. సురేష్ కుమార్ సంయుక్తంగా తెలిపారు.శుక్రవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వినియోగదారుల ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి జాతీయ స్థాయిలో వినియోగదారుల సంఘాల ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ప్రస్తుత వినియోగదారుల సమస్యలు, చట్టపరమైన అంశాలు, పరిష్కార మార్గాలు మరియు భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా వినియోగదారులు ఆన్‌లైన్ మోసాలు, నకిలీ మరియు కల్తీ ఉత్పత్తులు, తప్పుదారి పట్టించే ప్రకటనలు, అధిక ధరలు, నాసిరకం వస్తువులు, సేవల్లో లోపాలు, డిజిటల్ లావాదేవీల మోసాలు తదితర సమస్యలను ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. ఇటువంటి సమస్యలపై వినియోగదారులకు అవగాహన కల్పించడంతో పాటు, బాధితులకు చట్టపరమైన పరిష్కారం అందేలా వినియోగదారుల సంఘాలు మరింత చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వ సహకారం అభినందనీయం 16వ జాతీయ వినియోగదారుల సదస్సు నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ నాదెండ్ల మనోహర్ శాఖ కమిషనర్ శ్రీ కె. కన్నబాబు, అందిస్తున్న సహకారం అభినందనీయమని సి సి సి మరియు క్యాప్కో చైర్మన్లు తెలిపారు. 18 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు ఈ జాతీయ సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 18 రాష్ట్రాలకు చెందిన వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలకు చెందిన వినియోగదారుల సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నట్లు వారు తెలిపారు.సదస్సులో వినియోగదారుల పరిరక్షణ చట్టం అమలు, ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాలు, దీ×ూ ప్రమాణాలు, డిజిటల్ వినియోగదారుల హక్కులు, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం, వినియోగదారుల సంఘాల బలోపేతం తదితర అంశాలపై విస్తృతంగా చర్చలు జరుగుతాయని తెలిపారు. ప్రముఖుల హాజరుఈ సదస్సుకు పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ కమిషనర్ శ్రీ కె. కన్నబాబు, ×ూూ, దీ×ూ డైరెక్టర్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీ ఆర్జే రత్నాకర్, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. వినియోగదారుల ఉద్యమానికి మరింత బలంవినియోగదారుల హక్కుల పరిరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రభుత్వం, వినియోగదారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వర్గాలు మరియు ప్రజలు సమన్వయంతో పనిచేసినప్పుడే బలమైన వినియోగదారుల ఉద్యమం సాధ్యమవుతుందని సి సి సి మరియు క్యాప్కో చైర్మన్లు తెలిపారు.జాతీయ స్థాయిలో వినియోగదారుల సంఘాల మధ్య సమన్వయం పెంచడం, రాష్ట్రాలు మరియు జిల్లాల స్థాయిలో వినియోగదారుల ఉద్యమాన్ని బలోపేతం చేయడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు. “బలమైన వినియోగదారుల సంఘాలు -- అవగాహన కలిగిన వినియోగదారులు -- సమర్థవంతమైన వినియోగదారుల పరిరక్షణ” అనే లక్ష్యంతో సిసి సి మరియు క్యాప్కో సంయుక్తంగా ముందుకు సాగుతున్నాయని వారు తెలిపారు.

## ఆశ కార్యకర్త పోస్టులకు దరఖాస్తు చేసుకోండి.




**గోరంట్ల సెప్టెంబర్ 11 సీమ వార్త.** గోరంట్ల 4 స్వర్ణగ్రామం పరిధిలో గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రి వెనుకు భాగంలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టు భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ వైద్యాధికారులు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడిస్తూ దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు తప్పనిసరిగా మహిళ అయి ఉండాలని, సంబంధిత గ్రామం/వార్డులో నివసిస్తూ ఉండాలని,వయస్సు 25--45 సంవత్సరాలు ఉండాలని,నిర్దేశించిన విద్యార్హత కలిగి ఉండాలని,సేవాభావం, ప్రజలతో సత్సంబంధాలు కలిగిన స్థానిక మహిళలకు ప్రాధాన్యత దరఖాస్తుల స్వీకరణ తేదీలు ఈ నెల 15 నుంచి 19 వరకు గ్రామీణ ప్రాంతాల్లో వి హెచ్ ఎస్ ఎన్ ఎన్ సి కమిటీ ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహించబడుతుంది. కమిటీ ఎంపిక చేసిన టాప్--3 అభ్యర్థుల పేర్లను జిల్లా స్థాయికి పంపించి, తుది ఎంపిక చేపడతారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## తాడిపత్రి నియోజకవర్గంలో హౌసింగ్ పై ఎమ్మెల్యే సమీక్ష

**గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**



**తాడిపత్రి, సెప్టెంబర్ 11 సీమ వార్త :** తాడిపత్రి నియోజకవర్గంలో హౌసింగ్ శాఖ పనితీరుపై ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తాడిపత్రిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో హౌసింగ్ డిపార్ట్మెంట్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే అష్మిత్ రెడ్డి, నియోజకవర్గంలో గృహ నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలు, ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాలు చేరేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

## పార్టీ గెలుపు కోసం నా శక్తి వంచన లేకుండా పోరాడుతా

**గతంలో మనం న్యాయబద్ధంగా ఉండబట్టే జేసీ ప్రభాకర్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ అయ్యారు - వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఫయాజ్ బాషా**



తాడిపత్రి, సెప్టెంబర్ 11 సీమ వార్త : తాడిపత్రిలోని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కార్యాలయంలో శుక్రవారం జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఫయాజ్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ గెలుపు కోసం తన శక్తి వంచన లేకుండా పోరాడుతానని, పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. తాడిపత్రి నియోజకవర్గంలో వైసీపీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గతంలో మనం న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా ఉన్నాం కనుకే జేసీ ప్రభాకర్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ అయ్యారని, లేకుంటే ఆయన చైర్మన్ అయ్యేవారు కాదని సంచలన వ్యాఖ్యలు చేశారు.

టీడీపీ నాయకులు తన ఇంటిపైకి దాడి చేసేందుకు వస్తే తట్టుకుని నిలబడతానని, భయపడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎవరి బెదిరింపులకు లొంగేది లేదని, జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసే వరకు విశ్రమించబోనని ఫయాజ్ బాషా పేర్కొన్నారు.

## కాలభైరవుని సన్నిధిలో భాద్రపద, పోలాల అమావాస్య పూజలు

**భక్తులతో కిక్కిరిసిన శ్రీ స్వయంభు కాలభైరవ స్వామి ఆలయం**
**ఆలయం ఎదుట కూష్మాండ దీపోత్సవం, భక్తులకు అన్నదానం**







**ధర్మవరం సెప్టెంబర్ 11 సీమ వార్త.**ధర్మవరం పట్టణంలోని శ్రీ స్వయంభు కాలభైరవస్వామి ఆలయంలో భాద్రపద, పోలాల అమావాస్య పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆధ్యాత్మికంగా శ్రావణమాసం తర్వాత వచ్చే అమావాస్యను భాద్రపద లేదా పోలాల అమావాస్యగా పిలుస్తారు. ఎంతో విశిష్టత ఉన్న అమావాస్య రోజున కాలభైరవునికి విశేష పూజలు నిర్వహించారు. అమావాస్య గడియల్లో ఆలయంలో పూజారి ధనుంజయ్ ఆచారి దోష నివారణ పూజలు చేశారు. భైరవున్ని ప్రత్యేకంగా అలంకరించి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి భక్తులచే అభిషేకాలు చేయించారు. ప్రదోష కాలం, అమావాస్య గడియల్లో కూష్మాండ దీపోత్సవాన్ని ప్రారంభించారు. ధర్మవరం నుంచే కాకుండా పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గుమ్మడికాయలపై దీపాలు వెలిగించి.. భైరవున్ని స్మరించుకున్నారు. అమావాస్య తరువాత కంకణదారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వద్ద పూజించిన గుమ్మడికాయలను, కొబ్బరికాయలను, కంకణాలను భక్తులకు అందజేశారు. ఆ తర్వాత భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి ధనుంజయ ఆచారి మాట్లాడుతూ పోలాల అమావాస్య రోజున తల్లులు తమ పిల్లల ఆరోగ్యం, దీర్ఘాయువు, కుటుంబ సౌభాగ్యం కోసం ప్రత్యేకంగా నోములు నోచుకుంటారని, ఉపవాస దీక్షలు చేస్తారన్నారు. హిందూ సంస్కృతిలో భాద్రపద అమావాస్య పితృ దేవతలకు తర్పణాలు అత్యంత అనుకూలమైన రోజుగా భావిస్తారని చెప్పారు...

## శ్రీ మారెమ్మ దేవి ఆలయంలో ఉచిత గుండె వైద్య శిబిరం

**----60 మందికి గుండె పరీక్షలు.. నలుగురికి అనంతపురానికి రెఫర్**





**గోరంట్ల, సెప్టెంబర్ 11:సీమ వార్త** గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని శ్రీ మారెమ్మ దేవి ఆలయంలో శ్రీ మారెమ్మ దేవి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బి. దేవిరాజు స్వామి ఆధ్వర్యంలో ప్రతి నెల నిర్వహిస్తున్న ఉచిత గుండె వైద్య శిబిరంలో భాగంగా శుక్రవారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు.అనంతపురానికి చెందిన సవేరా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చందు ధరణి, సిబ్బంది ఆనంద్, కావ్య, మారుతి సహకారంతో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మొత్తం 60 మందికి గుండె సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించగా, నలుగురికి మెరుగైన వైద్యం అవసరమని గుర్తించి అనంతపురంలోని ఆసుపత్రికి రెఫర్ చేశారు.వైద్య శిబిరానికి వచ్చిన భక్తులు, ప్రజలకు గుమ్మయ్యగారిపల్లికి చెందిన కమ్మ ఆదినారాయణ, రామకృష్ణ, గోరంట్లకు చెందిన సురేష్, పుష్పదేవి సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీ మారెమ్మ దేవి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బి. దేవి రాజస్వామి ఆలయ కమిటీ సభ్యులు పుటక శంకర్, వేణుగోపాల్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి నెల ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న శ్రీ మారెమ్మ దేవి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బి. దేవిరాజు స్వామిని పలువురు అభినందించారు.

## చెకుముకి ప్రతిభా పరీక్షలో గ్లోబల్ జెన్ విద్యార్థుల ప్రతిభ.

**.....జిల్లా స్థాయికి ఎంపికైన ముగ్గురు విద్యార్థులు**



**పెనుకొండ: సెప్టెంబర్ 11 సీమ వార్త.** చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో గ్లోబల్ జెన్ సీబీఎస్ఈ స్కూల్, పెనుకొండ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయికి ఎంపికైన ఆమీనాలులు, రసజ్ఞ,అక్షరగగన్ రెడ్డి విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మక ఆలోచనా శక్తిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన చెకుముకి ప్రతిభా పరీక్షలో వీరు ప్రతిభను చాటి జిల్లా స్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.జిల్లా స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులను అభినందించారు.

# గణేష్ మండపాల నిర్వాహకులకు అవగాహన సదస్సు నిర్వహించిన హుస్నాబాద్ పోలీసులు







**సిద్దిపేట** హుస్నాబాద్ పట్టణం లో ఈ రోజు గణేష్ మండపాల నిర్వాహకులకు అవగాహన సదస్సు నిర్వహించిన హుస్నాబాద్ పోలీసులు ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఏ సి పి సదానందం ఆధ్వర్యంలో సి ఐ శ్రీధర్ సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మారెడ్డి కార్యక్రమం నిర్వహించారు మండపం దగ్గర భద్రత కరెంట్ సరఫరా వైర్లు వేలాడుతున్న వైర్లను తాకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేస్తూ మద్యం సేవించి మండపాలదగ్గర డాన్స్ చేస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటా మని రాత్రి పది గంటల తర్వాత డాన్స్ చేస్తూ డి జే లు పెడుతున్నారు అలాంటివి మానుకోవాలని నిమజ్జన రోజు కూడా మద్యం సేవించి మండపాలదగ్గర డాన్స్ చేస్తూ ఉండరాదని తెలిపారు భక్తి మార్గం లో ధర్మబద్ధంగా మండపాల నిర్వహణ వుండాలనీ సినిమా పాటలు సౌండ్ తో ఇతరులకు ఇబ్బంది చేసి సంబరాలు చేయరాదని హితవు చెప్పారు

# రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ శ్రీనివాసరెడ్డిని సత్కరించిన







**– డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల .**

**భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం పొంగులేటి క్యాంపు కార్యాలయం లో , డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న తో కలసి ప్రెస్ మీట్‌లో పాల్గొన్న కొత్వాల . రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ మద్ది శ్రీనివాస రెడ్డి ని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్కెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. కొత్తగూడెం నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జిగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి కొత్తగూడెం వచ్చిన సందర్భంగా విద్యానగర్‌లోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మీడియా సమావేశంలో మద్ది శ్రీనివాసరెడ్డి , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న తో పాటు కొత్వాల, పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై కేవలం దళితుడనే ఉద్దేశ్యంతో ఉద్దేశ్య పూర్వకంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు మరో ఎమ్మెల్సీ లు అనుచిత వ్యాఖ్యలు చేశారని, వారిని వెంటనే పదవి నుండి బర్తరఫ్ చేయాలన్నారు. బీఆర్ఎస్ నాయకులకు దళితులంటే ఏహ్యాభావన ఉందని, దళితులను తక్కువగా చూడటం పరిపాటి అయిందన్నారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# దొర గడీలను బద్దలు కొట్టించిన చిట్యాల ఐలమ్మ తెలంగాణ సమాజానికి స్ఫూర్తి,





**సిపిఎం పట్టణ కార్యదర్శి పి తులసీరామ్**

**భద్రాద్రి కొత్తగూడెం :** పాల్వంచ టౌన్ తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా స్థానిక అల్లూరు సెంటర్ పార్టీ ఆఫీసులో చిట్యాల ఐలమ్మ గారి 41వ వర్ధంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది . పార్టీ టౌన్ కమిటీ సభ్యులు సీనియర్ ఎనాయకులు వింజ రాములు ఐలమ్మ గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం పార్టీ టౌన్ కార్యదర్శివర్గ సభ్యురాలు సత్యవాణి అధ్యక్షతన జరిగిన సభలో టౌన్ కార్యదర్శి పి తులసీరామ్ మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించిన ఒక మట్టి మనిషి సాయుధ పోరాటం కాలంలో దొరల దుర్మార్గాలకు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిలబడి 40 వేల ఎకరాల భూస్వామి విసునూరు రామచ ంద్రారెడ్డిని ఎదిరించి పోరాడిన ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి మహిళా లోకానికి ఆదర్శమని అన్నారు ఆంధ్ర మహాసభలో పాల్గొని కమ్యూనిస్టుల నాయకత్వాన జరుగుతున్న సాయుధ పోరాటంతో ఎర్రజెండా చేతపట్టి ఉమ్మడివరంగల్ జిల్లా జనగాం తాలూకాలో దొర గడిలను బద్దలు కొట్టిన చరిత్ర ఐలమ్మదని కొనియాడారు ఆనాటి సాయుధ పోరాటంతో ఎలాంటి సంబంధం లేని ఆర్ఎస్ఎస్ బిజెపి తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ ముస్లింల జరిగిన పోరాటంగా చూపేందుకు ప్రయత్నిస్తుందని నిజానికి సాయుధ పోరాటంలో అనేకమంది ముస్లింలు నైజాం కి వ్యతిరేకంగా పోరాడారని నిజాం సైన్యాలు వారికి అండగా నిలిచిన దొరలు ఒకవైపు ప్రజల మాన ప్రాణాలను హరిస్తూ వారితో వెట్టి చాకిరి చేయించుకున్నారని అలాంటి వారికి వ్యతిరేకంగా సాధారణ ప్రజలను సంఘం ఎర్రజెండా నాయకత్వంలో సమీకరించి ఆయుధాలు చేత పట్టించి నిజాం సైన్యాలను దొరలను పరుగులు పెట్టించిన చరిత్ర ఐలమ్మ గారిదని వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పనిచేయాలని పాలకవర్గాల,ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు వ్యతిరేకంగా సంఘటితంగా నిలబడి పోరాడాలని అదే ఐలమ్మ గారికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు ఈ కార్యక్రమంలో టౌన్ కార్యవర్గ సభ్యులు ఎస్.కె నిరంజన్ కమిటీ సభ్యులు బి కాంతి గౌసియా మాధవి శాఖా కార్యదర్శులు యాకోబు, కవిత కుమారి తదితరులు పాల్గొన్నారు

# స్థానిక పరిశ్రమలలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలకై పోరాటానికి యువత సిద్ధం కావాలి

**రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్ డిమాండ్**

**చౌటుప్పల్ :** భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డీవైఎఫ్ఐ) మహాసభ చౌటుప్పల్ మండలంలోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు, యువతకు ఉద్యోగ అవకాశాలు, ఉపాధి కల్పన తదితర అంశాలపై చర్చించారు.మహాసభలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి గడ్డం వెంకటేష్ మాట్లాడుతూ.. యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో యువతకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం యువత ఐక్యంగా ఉద్యమించాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని డీవైఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మహాసభలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధుకృష్ణ,కౌడి సురేష్,దయ్యాల మల్లేష్,వీణ సలీం ఞఖీ× మండల అధ్యక్ష కార్యదర్శులు రత్నం శ్రీకాంత్ పల్లె శివకుమార్, గండని లక్ష్మీపతి, బోదాస్ నరేష్, నత్తి నరేష్, జంగిలి సాయి, బాలెం నరేష్, బర్రె రాజు, బర్రె శశి తదితరులు పాల్గొన్నారు



## నేతన్నలకు ఊరట..రూల్స్ రిటన్..!!

**-మొదటిపేజీ తరువాయి**

నిబంధన పెట్టడంతో చేనేతలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఇదే విషయమై పలువురు నేతన్నలు, చేనేత సంఘాల ప్రతినిధులు మంత్రి సవిత దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. తక్షణమే ఆమె స్పందించి, సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి చేనేతల సమస్యను తీసుకెళ్లారు. బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్ నిబంధనను సడలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో, అర్హులైన చేనేతలందరికీ నేతన్న భరోసా పెన్షన్లు అందజేసే అవకాశం కలిగిందని మంత్రి సవిత తెలిపారు. నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంకు ఖాతా స్టేట్ మెంట్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలందరికీ నేతన్న భరోసా పెన్షన్లు అందజేస్తామని, అర్హులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ఆయా జిల్లాల చేనేత, జౌళి శాఖాధికారులు బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్లు లేకున్నా దరఖాస్తులు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మంది నేతన్నలకు ఉపశమనం కలగనుందని మంత్రి సవిత తెలిపారు. నేతన్నలకు ఆర్థిక మేలు చేకూర్చడమే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 85 వేల మందికిపైగా నేతన్నలకు నేతన్న భరోసా పెన్షన్ పథకం కింద రూ.4 వేలు చొప్పున అందజేస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్, నేతన్నల సేవలో పథకం కింద ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని మంత్రి సవిత గుర్తు చేశారు.

## కళ్యాణదుర్గాన్ని.....కరువు "దుర్గం"గా మార్చిన ఎల్ ని నో వర్షాభావం.

**-మొదటిపేజీ తరువాయి**

చంద్రబాబు నాయుడు 2028లో బీటీపీ కుందుర్పి బ్రాంచ్ కెనాల్ పనులను ఫోకస్ చేస్తామని మరో రెండేళ్లు వాయిదా వేయడంతో ఎంతో నమ్మకంతో ఎదురుచూస్తున్న ఈ ప్రాంత రైతులకు కాస్త నిరాశే మిగిల్చింది. ఎన్నికల ముందు ఈ పథకం పూర్తి అవుతుందా..? ఎన్నికలవేళ ఆగిపోతుందా అనేది రైతులను వేధిస్తున్న ప్రశ్న. కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్ పరిధిలో 1.84 లక్షల ఎకరాలు సాగు భూమి ఉండగా ఇందులో 1,16,470 ఎకరాల వేరుశెనగ సాగు భూమిలో కేవలం 35 165 ఎకరాలలో మాత్రమే వచ్చి రాని వర్షాలకు రైతులు వేరుశనగ విత్తనాలు వేసుకున్నట్లు స్థానిక వ్యవసాయ సంచాలకులు ఎల్లప్ప తెలిపారు. ఈ ఘనంగా పరిశీలిస్తే వేరుశనగ సాగు భూమిలో 70 శాతం భూమిలో విత్తనాలు వేయకుండా బీడుగా ఉంచినట్లు ఆయన వివరించారు. ఇదిలా ఉండగా కనీసం కంది పంట నైనా సాగు చేసి ఊరట చెందుదాం అనుకున్నా రైతులు సాధారణ కంది పంట విస్తీర్ణం 15,237 ఎకరాలు ఉండగా 30వేల 837 ఎకరాలలో 200% గా సాగు చేశారన్నారు. అయినా వర్షం కురువకపోవడం కారణంగా కందిపంట కూడా నిరాశ మిగిల్చినట్లు తెలిపారు. ప్రత్యామ్మాయ పంటల సాగులో భాగంగా కళ్యాణదుర్గం డివిజన్లో మొక్కజొన్న పంటను 31 వీధుల 557 ఎకరాల్లోనూ చిరుధాన్యాలు 1000 ఎకరాలలోనూ బోరు కింద సాగుచేసిన అవి కూడా ఆశించిన స్థాయిలో పండలేదన్నారు. సెప్టెంబర్ అక్టోబర్లో వర్షాలు కురిస్తే ఉలవలు సాగు చేసేందుకు విత్తనాలు సిద్ధం చేశామన్నారు. ఇదిలా ఉండగా రైతుల కోసం ఎరువుల దుకాణంలో ఎరువులు సిద్ధం చేసిన కొనే పరిస్థితి లేదని అన్నారు. కూరగాయలు, ఆకుకూరలు సాగు కూడా సాగునీరు లేక సాగు చేయడం వల్ల పౌష్టికాహారంకు సంబంధించిన ఆకుకూరలకు కూడా కరువు వచ్చినట్లు పేర్కొన్నారు. ఒకవైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే సామాన్యుడు ఏవీ కొనలేక–మరేవి తినలేక చతికిల పడుకున్నాడని తెలిపారు. ఇదిలా ఉండగా సాగులో టమోటా అరటి బత్తాయి పంటలను బోరు బావుల ఆధారంగా సాగుచేసిన బోర్లలో నీరు అడుగంటి పోవడంతో ఆ పంటలు కూడా పండించలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే సోనా మసూరి బియ్యం ధర 25 కేజీల బస్తా రూ.1800 కు చేరుకుంది. బియ్యమే కాదు గోధుమలు జొన్నలు రాగులు లాంటి ధాన్యాలు కూడా ధరలు విపరీతంగా పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ కరువు పరిస్థితులను పాలక ప్రభుత్వాలు అధ్యయనం చేసి తీవ్రమైన కరువును ఎదుర్కొంటున్న ప్రాంతాలలో ప్రజలకు ఆహార సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు

## ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు.....ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులు.

కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 11 సీమవార్త

కళ్యాణదుర్గం: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (నార్త్)లో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడిపై 9వ తరగతి విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన, అనుచితంగా తాకుతున్నారంటూ ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. కొంతకాలంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలియజేయడంతో విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.విద్యార్థినుల నుంచి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆగ్రహంతో పాఠశాలకు చేరుకుని సంబంధిత ఉపాధ్యాయుడిని నిలదీసినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో వారు పాఠశాలకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అనంతరం విద్యార్థినుల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు స్వీకరించి, ఆరోపణలపై విచారణ చేపట్టినట్లు సమాచారం. విద్యార్థుల భద్రత, పాఠశాలల్లో ఉపాధ్యాయుల ప్రవర్తనపై ఈ ఘటన చర్చకు దారితీసింది. ఇటీవలే కళ్యాణదుర్గంలో ఉపాధ్యాయుల సేవలను గౌరవిస్తూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కార కార్యక్రమం నిర్వహించి విజ్ఞానాన్ని అందించే ఉపాధ్యాయ వృత్తిని, ఆ వృత్తిలో సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను గౌరవించి, సమాజానికి ఉపాధ్యాయులు ఎంతో అవసరమన్న సందేశాన్ని చాటిచెప్పారు. ఉన్నత సయ్యాలు కలిగిన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి సంఘటనలు వెలుగులోకి రావడం స్థానికంగా చర్చనీయాంశం అవుతోంది. ఈ కేసు పై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రాథమిక దర్యాప్తు జరిపి నిందిత ఉపాధ్యాయునిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్ తెలిపారు. బాలికల పట్ల ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే నిందితులను కఠినంగా చింతిస్తామని ఎవరిని ఉపేక్షించేది లేదని సిఐ స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ అగ్రనేతలతో పట్నం అవినాష్‌రెడ్డి భేటీ

**కేటీఆర్, హరీష్‌రావులను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ జడ్పీటీసీ**

**శంకర్‌పల్లి :–** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులను షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. చందన్‌వెల్లి గ్రామ మాజీ సర్పంచ్ కోలన్ ప్రభాకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా కోలన్ ప్రభాకర్‌రెడ్డి, పట్నం అవినాష్‌రెడ్డితో కలిసి కేటీఆర్, హరీష్‌రావులను కలసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులు చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణగౌడ్, ప్రభాకర్ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పంట నమోదు తప్పక చేయించుకోవాలి

**పొలాల వద్ద అందుబాటులో ఉండి సరైన వివరాలు అందించాలి**

**చేవెళ్ల :–** ప్రభుత్వం నియమించిన పంట నమోదు సిబ్బంది గ్రామాల్లో రైతుల పొలాలను సందర్శించి, రైతులు సాగు చేసిన పంట, సర్వే నంబర్‌తో పాటు ఇతర వివరాలను నమోదు చేయనున్నట్లు టంగుటూరు గ్రామ వాలంటీర్ కోడి విష్ణు తెలిపారు. పంట నమోదు వివరాల ఆధారంగానే ప్రభుత్వం పంట ఉత్పత్తులను కొనుగోలు చేయనున్నందున రైతులు నమోదు ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పంట నమోదు సిబ్బంది తమ గ్రామానికి వచ్చిన సమయంలో రైతులు తమ పొలాల వద్ద అందుబాటులో ఉండి, సాగు చేసిన పంటకు సంబంధించిన సరైన వివరాలను తెలియజేసి పంట నమోదు

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL 2013/54348 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881